Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU





అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 300 పేజీలు (Pages): 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)


బుధవారం, 15 - 7 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# అర్జీల పరిష్కారం, క్షేత్ర స్థాయి పర్యటనలు తప్పనిసరి

## - మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ రిజల్ట్స్ సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించారు. డేటా డ్రివెన్ గవర్నెన్సు ఆధారంగా పాలనను మరింత సులభతరం చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం అన్నారు. దీనికోసం దేశంలోనే మొదటిసారిగా మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా వృద్ధిని సమీక్షించుకుంటున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతీ నెలా... నెలవారీ ఆర్ధిక నివేదికలను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా రాష్ట్ర పురోగతి కోసం ప్రభుత్వ శాఖలు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో ఎంఈఆర్‌పై నిర్వహించిన సమావేశంలో సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నెలవారీ ఆర్ధిక నివేదికల ద్వారా ఎప్పటికప్పుడు రెవెన్యూ రాబడులను అంచనా వేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అధికారులు, ఉద్యోగుల నెలవారీ పనితీరును, నైపుణ్యాలను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని ముందుకు వెళ్తామన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."2019-2024 మధ్య అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం రెండేళ్లుగా సమిష్టిగా పనిచేసాం. ప్రభుత్వ ఆలోచనల్ని అధికార యంత్రాంగం సమర్ధంగా అమలు చేసింది. క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పుల్ని కొంతవరకు సాధించగలిగాం. మరిన్ని రంగాల్లో మరింతగా మెరుగుపడాలి. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పన చేశాం. తలసరి ఆదాయం, జీఎస్డీపీ లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. సుపరిపాలన అందించేలా ప్రతీ సోమవారం ఆర్టీజీఎస్ నుంచి సమీక్షలతో పాటు 4 సార్లు మంత్రులు, కార్యదర్శుల సమావేశాలు, 7 సార్లు కలెక్టర్ల సదస్సులు నిర్వహించాం. 19 ఎస్ఐపీబీ సమావేశాలు, 52 కేబినెట్ సమావేశాల ద్వారా పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. గత పాలనలో ఏపీపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం పోయింది. మేం అధికారంలోకి వచ్చాక పరిస్థితిలో మార్పు తెచ్చాం. దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా మారింది. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగాయి. వనరుల్ని సమర్ధంగా వినియోగించుకోవాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ఏపీని పారిశ్రామికంగా అగ్రగామిగా నిలబెట్టాలనే ఆలోచనతో పనిచేస్తున్నాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ఇలా అన్ని జిల్లాల్లో అపారమైన వనరులు, పెట్టుబడి అవకాశాలు ఉన్నాయి. రేర్ ఎర్త్ మినరల్స్, సిలికా, గ్రానైట్, బాక్సైట్ సహా విలువైన వనరులను వాల్యూ అడిషన్ చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ఇన్నోవేషన్ ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. టెక్నాలజీ, వనరులు, నాలెడ్జి మన దగ్గర ఉన్నాయి. దానిని అందిపుచ్చుకునే నాయకత్వం మనకు కావాలి. పాలసీలు తీసుకురావటం సులభమే అయినా వాటిని అమలు చేయటమే అత్యంత కీలకం. ఇక నుంచి నెల వారీ ఆర్ధిక నివేదికల ద్వారా ముందుకు వెళ్లాలని నిర్ణయించాం. ప్రతీ నెలా ఒకసారి కార్యదర్శులు, హెచ్‌వోడీల సమావేశం ద్వారా ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించుకుందాం." అని ముఖ్యమంత్రి అన్నారు.

**అర్జీలు వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన**

'గత పాలనలో కొన్ని ప్రభుత్వ శాఖల్లో పనితీరు మెరుగ్గా లేకపోవటంతో ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు వచ్చాయి. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ ద్వారా ఈ అర్జీలను వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన కలిగించాలి. గత పాలకుల వల్ల రెవెన్యూ శాఖలో అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. భూ వివాదాలకు సంబంధించిన అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి వచ్చింది. పీజీఆర్ఎస్‌లో జీరో పెండెన్సీ అనేది లక్ష్యం కావాలని అన్ని శాఖలకూ నిర్దేశిస్తున్నాను. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి లాంటి ప్రాంతాల్లో భూ సమస్యల్ని పరిష్కరించాం. రీసర్వే ప్రక్రియ ద్వారా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రతీ నెలా 9 తేదీన పంపిణీ చేస్తున్నాం. ఇంకా 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ శాఖలు ఆర్జీల పరిష్కారం కోసం నిబంధనల్లో మార్పులు తీసుకురావడం, లేదంటే చట్టాలను సవరించే అంశంపై విశ్లేషణ చేయాలి. మెరుగ్గా పనిచేస్తే 15 శాతం వృద్ధి రేటును సాధించే అవకాశం ఉంది. పాలన సులభతరం చేసేందుకు, రెవెన్యూ వసూళ్లు పెంచుకునేలా కొన్ని ఏఐ టూల్స్ కూడా రూపొందించాం. ఈ ఏడాది వివిధ ప్రభుత్వ శాఖల్లో 24 శాతం మేర రెవెన్యూ వసూళ్లు పెరిగాయి. జీఎస్డీపీ వృద్ధిరేటు 2017తో పోలిస్తే గత ఏడాదిలో 20 శాతం మేర పెరిగింది. కీలకస్థానాల్లో పనిచేస్తున్న కొందరు వ్యక్తులు అభివృద్ధి నిరోధకులుగా పనిచేయటం సరికాదని హెచ్చరిస్తున్నానను.' అని ముఖ్యమంత్రి అన్నారు.

**నాలుగు గోడలు దాటి వెళ్లాలి**

ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోనూ పర్యటించాలి. ప్రజల సమస్యలు, వాస్తవాలు తెలియాలంటే క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలి. మూడో ఏడాదిలోకి అడుగు పెట్టినప్పటికీ విద్యుత్ ఛార్జీలను పెంచలేదు. ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని చెప్పిన మాటను నిలబెట్టుకున్నాం. తొలిసారి ట్రూ డౌన్‌ను కూడా అమలు చేస్తున్నాం. పట్టిసీమ నీటితో గోదావరి నుంచి కృష్ణా డెల్టా ఆయకట్టుకు నీరు అందించగలుగుతున్నాం. రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ కార్యక్రమాలు చక్కగా జరుగుతున్నాయి. ఎల్‌నినో కారణంగా తలెత్తిన తీవ్ర వర్షాభావ పరిస్థితులపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలి. ఒక మంచి అధికారి సమస్యలను పరిష్కరిస్తే...అద్భుతంగా పనిచేసే అధికారి అసలు సమస్యలనేవే తలెత్తకుండా చూస్తారనే కోణంలో అందరూ పని చేయాలి.

ముందుచూపుతో అంతా పనిచేస్తేనే మెరుగైన పాలనను, ఫలితాలను ప్రజలకు అందించగలం. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఆగస్టు 14 తేదీన అనకాపల్లికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తాం. సెప్టెంబరు 1వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను కూడా జాతికి అంకితం చేస్తాం. రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను కూడా ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం.

ప్రతీ నెలా జరిగే మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ఆధారంగా ఎప్పటికప్పుడు సమీక్షించుకుని ముందుకు వెళ్దాం. రాష్ట్రాభివృద్ధిలో సహకరిస్తున్న అధికారులు, ఉద్యోగులందరికీ అభినందనలు తెలియచేస్తున్నానని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ సమావేశానికి మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఆయా శాఖల కార్యదర్శులు, హెచ్‌ఓడీలు హాజరయ్యారు.

# నెలవారీ ఆర్ధిక నివేదికతో దేశంలోనే సరికొత్త పరిపాలనా విధానానికి శ్రీకారం

## - డేటా ఆధారిత సుపరిపాలన, జీరో పెండెన్సీ, క్షేత్రస్థాయి పర్యవేక్షణతో స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనే ప్రభుత్వ ధ్యేయం : రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్ధసారధి

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రం ఇప్పటి వరకు అమలు చేయని సరికొత్త పరిపాలనా విధానానికి నాంది పలికిందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్ధసారధి తెలిపారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఆర్థిక నివేదికలు వార్షిక ప్రాతిపదికన మాత్రమే రూపొందించే ఆనవాయితీ ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రతి నెలా "నెలవారీ ఆర్థిక నివేదిక" రూపొందించే వినూత్న విధానాన్ని ప్రారంభించడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ నెలవారీ ఆర్థిక నివేదిక ద్వారా రాష్ట్రంలోని అన్ని శాఖల పనితీరు, ఆదాయ-వ్యయాలు, అభివృద్ధి సూచికలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, లక్ష్యాల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవల ప్రభావం వంటి అంశాలను సమగ్రంగా సమీక్షించే అవకాశం లభిస్తుందని వివరించారు. ఇది కేవలం ఒక నివేదిక మాత్రమే కాకుండా, ప్రభుత్వ పరిపాలనకు దిశానిర్దేశం చేసే ప్రామాణిక పత్రంగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అపారమైన పరిపాలనా అనుభవాన్ని, ఆర్థిక అవగాహనను, భవిష్యత్ దృష్టిని సమన్వయం చేసి ఈ విధానానికి రూపకల్పన చేశారని మంత్రి కొనియాడారు. రాష్ట్ర పరిపాలనను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా, ఫలితాల ఆధారంగా తీర్చిదిద్దేందుకు ఈ నివేదిక కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, సమస్యలను వేగంగా పరిష్కరించడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని మరింత చురుకుగా మార్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకోసం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ వద్ద అందుబాటులో ఉన్న ప్రత్యక్ష సమాచారాన్ని, కృత్రిమ మేధస్సు సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించి డేటా ఆధారిత పరిపాలన అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు, మంత్రులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ప్రజల సమస్యలను రియల్ టైమ్‌లో గుర్తించి, వెంటనే పరిష్కరించే విధంగా ప్రతి శాఖ పని చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు వెల్లడించారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక సంక్షోభం నుంచి కేవలం రెండేళ్ల వ్యవధిలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి పరిపాలనా దక్షత, ఆర్థిక క్రమశిక్షణ, దూరదృష్టికే చెందుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ రెండేళ్లలో రాష్ట్రం ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయ, మౌలిక సదుపాయాలు, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలను సాధించేందుకు రాష్ట్రం ప్రతి సంవత్సరం కనీసం 15 శాతం ఆర్థిక వృద్ధి నమోదు చేయడంతో పాటు, 20 నుంచి 25 శాతం వరకు ఆదాయ వృద్ధి సాధించేలా అన్ని శాఖలు లక్ష్య బద్ధంగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి తెలిపారు. ప్రతి నెలా నెలవారీ ఆర్థిక నివేదిక ఆధారంగా శాఖల పురోగతిని సమీక్షించి, తదుపరి నెల లక్ష్యాలను నిర్ణయిస్తూ పరిపాలనను ఫలితాల దిశగా నడిపించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేసినట్లు చెప్పారు. ఈ విధానాల ద్వారా నిరుద్యోగ సమస్యను గణనీయంగా తగ్గించడం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, ప్రజల ఆదాయాలను పెంచడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రత్యేకంగా పిజిఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ)లో "జీరో పెండెన్సీ" ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టంగా ఆదేశించారని మంత్రి వెల్లడించారు. ప్రజావేదికలు, ప్రజాదర్బార్లు, జిల్లా పర్యటనల సందర్భంగా ప్రజల నుంచి అందుతున్న ప్రతి వినతిని మానవీయ దృక్పథంతో పరిశీలించి, ఎలాంటి పెండింగ్ లేకుండా వేగంగా పరిష్కరించాలని సూచించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో పరిపాలనా నిర్లక్ష్యం, కక్షపూరిత వైఖరి, ముఖ్యంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల కారణంగా వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని ముఖ్యమంత్రి సమావేశంలో ప్రస్తావించినట్లు మంత్రి తెలిపారు. ప్రజల సమస్యలను కేవలం కార్యాలయ విధులుగా కాకుండా, బాధిత కుటుంబాల జీవన పరిస్థితులను అర్థం చేసుకుంటూ మానవీయ కోణంలో పరిష్కరించాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే పాత చట్టాలు, కాలానుగుణంగా అనవసరంగా మారిన నిబంధనలను సమీక్షించి, అవసరమైతే వాటిలో సవరణలు చేయడానికైనా, కొత్త చట్టాలను తీసుకురావడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రజా ప్రయోజనమే ప్రభుత్వ నిర్ణయాలకు కేంద్ర బిందువుగా ఉండాలని పేర్కొన్నారని వివరించారు. పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావాలంటే ఉన్నతాధికారులు, శాఖల కార్యదర్శులు, జిల్లా అధికారులు, మంత్రులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. కార్యాలయాల్లో మాత్రమే పరిమితమయ్యే పరిపాలనకు బదులుగా ప్రజల మధ్యకు వెళ్లి ప్రత్యక్షంగా సమస్యలను తెలుసుకోవడం ద్వారా వాస్తవ పరిస్థితులు అర్థమవుతాయని, భవిష్యత్ విధాన నిర్ణయాలకు అది బలమైన ఆధారంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు మంత్రి వివరించారు. అధికారులు నిర్వహించే క్షేత్రస్థాయి పర్యటనలు, తనిఖీలు, పరిశీలనల వివరాలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా, అవసరమైతే ఏఐ ఆధారిత వ్యవస్థల ద్వారా ఆర్‌టిజిఎస్‌లో నమోదు చేయాలని కూడా ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు. సుపరిపాలన, ఆర్థిక క్రమశిక్షణ, సమర్థవంతమైన నిర్వహణ ఫలితంగానే గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై ఒక్క రూపాయి అదనపు విద్యుత్ భారం కూడా మోపకుండా విద్యుత్ రంగాన్ని సమర్థంగా నిర్వహించగలిగిందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలపై అనవసర భారాలు పడకుండా ఆర్థిక నియంత్రణతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. అదేవిధంగా, గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటు కేంద్ర ప్రభుత్వం నమోదుచేసిన వృద్ధిరేటు కంటే తక్కువగా ఉండేదని, అయితే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వృద్ధిరేటు జాతీయ సగటును మించి నమోదవుతున్న విషయం సమావేశంలో ప్రత్యేకంగా చర్చించబడిందని మంత్రి వెల్లడించారు. ఈ ఏడాది ఎల్-నినో ప్రభావంతో తాగునీరు, సాగునీరు, ప్రజారోగ్యం తదితర రంగాల్లో సవాళ్లు ఎదురయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు. ప్రకృతి పరిస్థితులను కారణంగా చూపకుండా, ప్రతి సవాల్‌ను శాస్త్రీయ విధానాలతో, సమన్వయంతో అధిగమించేందుకు అధికారులు వినూత్న ఆలోచనలు చేయాలని, ప్రభుత్వానికి కార్యాచరణ సూచనలు సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. రానున్న మూడేళ్లు రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే అత్యంత కీలక కాలమని పేర్కొంటూ, ప్రతి మంత్రి, ప్రతి అధికారి ఫలితాల ఆధారంగా పనిచేసి స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారని మంత్రి కొలుసు పార్ధసారధి తెలిపారు. ప్రజాకేంద్రిత పరిపాలన, డేటా ఆధారిత నిర్ణయాలు, పారదర్శక వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, జీరో పెండెన్సీ, క్షేత్రస్థాయి పర్యవేక్షణ వంటి సంస్కరణల ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఉత్తమ పరిపాలన అందించే రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు.



# ప్రపంచ స్ట్రోక్ సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌కు డా.పి.విజయ ఎన్నిక



**గుంటూరు, (రాజధాని వార్తలు):** గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్టు, లలితా పి.వి.ఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ న్యూరోసైన్సెస్ విభాగాధిపతి, అంకినీడు అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్ డైరెక్టర్, న్యూరోసైంటిస్ట్స్ అసోసియేషన్, గుంటూరు అధ్యక్షురాలు డా. పి.విజయ ప్రపంచ స్ట్రోక్ సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా 95 దేశాలకు చెందిన 3,500 మంది WSO సభ్యుల ద్వారా ఎన్నికైన 18 మంది ప్రతిష్టాత్మక డైరెక్టర్లలో డా. విజయ ఒకరిగా ఎన్నిక కావడం విశేషం. అమెరికా, యూరప్, ఆఫ్రికా/మిడిల్ ఈస్ట్‌లతో పాటు ఉన్న 4 ప్రధాన ఖండాల గ్రూపులలో ఒకటైన ఆసియా-ఓషియానియా ప్రాంతానికి డాక్టర్ విజయ గారు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం) అత్యుత్తమ చికిత్సలు, పరిశోధన, ప్రజలలో అవగాహన మరియు ప్రజారోగ్య విధానాల రూపకల్పనలో ఆమె అందించిన విశిష్ట సేవలకు గాను ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ప్రపంచ స్ట్రోక్ సంస్థ అనేది ప్రపంచవ్యాప్తంగా పక్షవాత నివారణ, అత్యాధునిక చికిత్స, పునరావాసం, పరిశోధన, వైద్య విద్య మరియు ప్రజల్లో అవగాహన పెంపుదల కోసం పనిచేస్తున్న అత్యున్నత అంతర్జాతీయ సంస్థ. డా.విజయ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యురాలిగా 2026 నుంచి 2030 వరకు నాలుగేళ్లపాటు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ పదవిలో ఆమె ప్రపంచ వ్యాప్తంగా స్ట్రోక్ వైద్య విధానాల రూపకల్పన, అంతర్జాతీయ చికిత్స మార్గదర్శకాల అభివృద్ధి, విద్యా కార్యక్రమాల నిర్వహణ, ప్రపంచ స్ట్రోక్ కార్యక్రమాల పర్యవేక్షణ, వివిధ దేశాల స్ట్రోక్ నిపుణులు మరియు జాతీయ స్ట్రోక్ సంఘాల మధ్య సమన్వయం, అలాగే స్ట్రోక్ అవగాహన మరియు సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. నూతన బోర్డు తొలి సమావేశంలో పాల్గొనడానికి ఈ ఏడాది అక్టోబర్లో ఆమె దక్షిణ కొరియాలోని సియోల్కు వెళ్లనున్నారు. భారతదేశంలో ఆధునిక స్ట్రోక్ వైద్య సేవలకు శ్రీకారం చుట్టిన ప్రముఖుల్లో డా.విజయ ఒకరు. ఆమె 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో మొట్టమొదటి స్ట్రోక్ యూనిట్ను ప్రారంభించారు. ముంబై, చెన్నై తర్వాత దేశంలో స్థాపించబడిన మూడవ స్ట్రోక్ యూనిట్. ఆమె నాయకత్వంలో ఈ కేంద్రం ఎంతో అభివృద్ధి చెంది, భారతదేశంలోనే మొట్టమొదటి అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్‌గా గౌరవాన్ని అందుకుంది. డా.విజయతో పాటు ఆమె నాయకత్వంలోని అంకినీడు అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్ అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకుంది. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రదానం చేసే పాల్ డడ్లీ వైట్ ఇంటర్నేషనల్ స్కాలర్ అవార్డు, అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ యొక్క ఏ.బి. బేకర్ అవార్డు, అలాగే ప్రపంచ స్ట్రోక్ సంస్థ-ఏంజెల్స్ కార్యక్రమం నుంచి వరుసగా డైమండ్ స్టేటస్ అవార్డులు అందుకోవడం విశేషం. ప్రపంచ స్ట్రోక్ సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్కు డా. విజయ ఎన్నిక కావడం భారతదేశంలో స్ట్రోక్ వైద్యరంగ అభివృద్ధికి ఆమె అందించిన అసాధారణ సేవలకు అంతర్జాతీయ గుర్తింపుగా నిలిచింది. ఈ అరుదైన గౌరవం లలితా పి.వి.ఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఆంధ్రప్రదేశ్ వైద్య సమాజం మరియు యావత్ దేశానికి గర్వకారణమని పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# డొనేషన్ స్కీంలో మార్పులు.. సామాన్య భక్తులకే ప్రాధాన్యం..టీటీడీ కీలక నిర్ణయం

**తిరుమల, (రాజధాని వార్తలు):** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలక మండలి సమావేశం ముగిసింది. మంగళవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అజెండాలోని 72 అంశాలను చర్చించినట్లు టీటీడీ చైర్మన్ తెలిపారు. నిత్య హారతులపై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేశారని.. తిరుమలలోని నిబంధనలపై లేఖ ద్వారా ఆయనకు తెలియజేయనున్నట్లు చెప్పారు. రూ.6.31 కోట్లతో తిరుమలలోని ఏటీసీ వద్ద ఎస్ఎస్డీ టోకెన్స్ భక్తుల కోసం శాశ్వత క్యూ లైన్లను నిర్మిస్తామన్నారు. కుమార ధార, పసుపు ధార వద్ద రూ.2.77 కోట్లతో బ్రిడ్జి నిర్మాణంతో పాటు, గ్రీన్ ఎనర్జీ అభివృద్ధి కోసం జీఎన్సీ వద్ద 800 కిలో వాట్స్ విండ్ మిల్ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఎస్వీ మ్యూజియంలో 12 ఏళ్లు పైబడిన వారికి రూ.50 టికెట్ ధరను నిర్ణయించామని, మ్యూజియం నిర్వహణను టాటా కంపెనీకి ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపుతామని టీటీడీ చైర్మన్ చెప్పారు. కాకుల మానుకొండ వద్ద ఉన్న వేల టన్నుల వేస్ట్‌ను తరలించేందుకు రూ.5 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. భక్తుల భద్రత దృష్ట్యా టీటీడీ ఆలయాల్లో రూ.2.35 కోట్లతో ఫైర్ సేఫ్టీ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. ఏటీసీ, టీబీసీ వద్ద 12 పాత భవనాలు తొలగించి దాతల సహకారంతో నూతన భవనాలు నిర్మిస్తామన్నారు. 2027 డైరీ, క్యాలెండర్ ప్రింటింగ్ టెండర్లను అతి తక్కువ ధరకే ఇచ్చేలా ఆమోదం తెలిపామన్నారు. రూ.2.91 కోట్లతో అక్టోపస్ బేస్ క్యాంపు వద్ద ఎఫ్ఎంఎస్ పనుల నిర్వహణకు ప్రభుత్వానికి ప్రతిపాదన చేయాలని పాలక మండలి సమావేశంలో నిర్ణయించినట్లు చెప్పారు. ఒంటిమిట్టలో బంగారు కవచం తయారీకి కేజీ బంగారు ఇచ్చేందుకు సమావేశంలో



ఆమోదం తెలిపామని టీటీడీ చైర్మన్ అన్నారు. రూ. 17.86 కోట్లతో 100 గదుల నిర్మాణానికి ఆమోద ముద్ర వేశామన్నారు. ఒంటిమిట్ట ఆలయ మాడవీధుల విస్తరణ కోసం రూ.2.11 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. తాతయ్య గుంట గంగమ్మ ఆలయ అభివృద్ధి కోసం రూ.2.5 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో నిత్య పారాయణం కోసం 791 వేద పండితుల పోస్ట్‌ల నియామకానికి ఆమోదం తెలిపామన్నారు. డీపీపీలోని కళాకారుల జీతభత్యాల పెంపునకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. 65 సర్వర్ పోస్ట్‌లను క్యాటరింగ్ సూపర్‌వైజర్లుగా పదోన్నతికి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించాలని సమావేశంలో నిర్ణయించినట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు.

**డొనేషన్ స్కీంలో మార్పులు: ఈవో రవిచంద్ర**

డొనేషన్ స్కీంలో మార్పులు చేశామని ఈవో రవిచంద్ర అన్నారు. భక్తులకు ఆమోదయోగ్యంగా ఉండేలా నూతన పాలసీని తీసుకొచ్చామన్నారు. సామాన్య భక్తులకు దర్శనంలో ప్రాధాన్యం ఇచ్చేందుకు డోనర్స్ ప్రివిలేజ్‌ని తగ్గించామని తెలిపారు. నేటి అర్ధరాత్రి నుంచి నూతన పాలసీ అమలులోకి వస్తుందని ఈవో రవిచంద్ర వెల్లడించారు.

# తెల్ల కస్తూరి భాయికి ఆంధ్ర ప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సన్మానం

**విజయవాడ, (రాజధాని వార్తలు):** విజయవాడలోని సీఆర్ మీడియా అకాడమీ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఇటీవల అకాడమీ ఇంచార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తెల్ల కస్తూరి భాయిని ఆంధ్ర ప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు యేమినేని వెంకటరమణ, ఇస్కా రాజేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి వివేక్ యాదవ్, పసుపులేటి చైతన్య, రాజా,



ప్రశాంత్, సీనియర్ జర్నలిస్ట్ వల్లూరు ప్రసాద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ జర్నలిస్ట్‌లకు త్వరలో శిక్షణా తరగతులు

## - సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్



**అమరావతి, (రాజధాని వార్తలు):** విజయవాడ జర్నలిస్ట్‌లకు త్వరలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు సీ ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ వెల్లడించారు. విజయవాడలోని సీ ఆర్ మీడియా అకాడమీ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఆంధ్ర ప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు యేమినేని వెంకటరమణ, ఇస్కా రాజేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి వివేక్ యాదవ్, పసుపులేటి చైతన్య, రాజా, ప్రశాంత్, సీనియర్ జర్నలిస్ట్ వల్లూరు ప్రసాద్ కుమార్ తదితరులు అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్‌ను కలిసి జర్నలిస్ట్‌ల సమస్యలపై చర్చించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో జర్నలిస్ట్‌లకు శిక్షణా తరగతులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పందించిన ఆయన త్వరలో కృష్ణా జిల్లాతో పాటు ఎన్టీఆర్ జిల్లాలో కూడా శిక్షణా తరగతులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

# ఆంధ్రప్రదేశ్ చేనేత ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో విస్తృత అవకాశాలు : ఎంపీ విజయేంద్ర ప్రసాద్





**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ చేనేత, వస్త్ర ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయని, నైపుణ్యమైన నేత కళాకారులను వర్చువల్ రియాలిటీ (వీఆర్) వంటి ఆధునిక సాంకేతికత ద్వారా అంతర్జాతీయ కొనుగోలుదారులతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని రాజ్యసభ సభ్యుడు వి. విజయేంద్ర ప్రసాద్ అన్నారు. భారత్ మండపంలో మంగళవారం ప్రారంభం అయిన భారత్ టెక్స్-2026 ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను ఆయన సందర్శించారు. భారతీయ సాంప్రదాయ హస్తకళలు, చేనేత ఉత్పత్తులకు ముఖ్యంగా అమెరికాలోని భారతీయ ప్రవాసులు, అంతర్జాతీయ వినియోగదారుల్లో మంచి ఆదరణ పెరుగుతోందని ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ అన్నారు. ఈ అవకాశాన్ని ఆంధ్ర ప్రదేశ్ సమర్థంగా వినియోగించుకుంటే చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ (లేపాక్షి) పసుపులేటి హరి ప్రసాద్ పెవిలియన్‌ను సందర్శించారు. రాష్ట్ర చేనేత, వస్త్ర రంగ సామర్థ్యాలను, పెట్టుబడి అవకాశాలను సమర్థవంతంగా ప్రదర్శించిన చేనేత, జౌళి శాఖ అధికారులను ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో అమలవుతున్న ఏపీ టెక్స్‌టైల్ పాలసీ-4.0 ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో హాల్ నంబర్-9లో ఏర్పాటు చేసిన ఈ ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను శాఖ కమిషనర్ జి.రేఖారాణి, ప్రారంభించారు. ఇందులో చేనేత, వస్త్ర, అపారెల్, గార్మెంట్స్ ఉత్పత్తులతో పాటు జీఐ ట్యాగ్, వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్ (ఓడీఓపీ) ఉత్పత్తులను ప్రదర్శించారు. గుంటూరు టెక్స్‌టైల్ పార్క్, తారకేశ్వర టెక్స్‌టైల్ పార్క్, హరీష్ ఫ్యాషన్స్, ఏప్కో, మ్యాజిక్ వీవ్స్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను సందర్శించిన అపారెల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఏఈపీసీ) రాష్ట్రంలోని టెక్స్‌టైల్ ఎంఎస్ఎంఈలకు ఎగుమతులపై అవగాహన, సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేందుకు చేనేత, జౌళి శాఖతో భాగస్వామ్యం చేసేందుకు ఆసక్తి వ్యక్తం చేసింది. భారత్ టెక్స్-2026లో రాష్ట్ర భాగస్వామ్యం ద్వారా ఆంధ్రప్రదేశ్ చేనేత, వస్త్ర రంగానికి అంతర్జాతీయ గుర్తింపు పెరగడంతో పాటు పెట్టుబడులు, ఎగుమతులు, జాతీయ-అంతర్జాతీయ భాగస్వామ్యాలకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని అధికారులు తెలిపారు.

# మోదీజీ.. కేతన్‌ను హత్య చేసిన వారిని వదిలి పెట్టొద్దు.. రాఖీ అగర్వాల్ భావోద్వేగ లేఖ

**మహారాష్ట్ర:** పుణెలోని లోహగడ్ కోట వద్ద రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. వివాహం ఇష్టం లేకపోవడంతో సియా గోయల్ తన ప్రియుడు చేతన్ చౌదరితో కలిసి కాబోయే భర్త కేతన్‌ను హత్య చేసింది. ఈ కేసులో విచారణ కొనసాగుతున్న కొద్దీ పోలీసులకు నివ్వెరపోయే విషయాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. అయితే, తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి కేతన్ తల్లి రాఖీ అగర్వాల్ తాజాగా ఓ భావోద్వేగ లేఖ రాశారు. కేసు విచారణను వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని లేఖలో ఆమె విజ్ఞప్తి చేశారు.

**లేఖలో ఏముందంటే..**

'మోదీజీ.. నేను ఓ తల్లిని మాత్రమే. నాకు సానుభూతి అవసరం లేదు. ఎలాంటి ప్రత్యేక సహాయం కూడా కోరడం లేదు. నా కుమారుడిని చంపిన వారికి చట్టం ప్రకారం కఠినమైన శిక్ష పడేలా చేసి న్యాయం చేయండి. ఈ కేసులో విచారణను వేగంగా పూర్తయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నా. ప్రతి తల్లిలాగే నా కుమారుడు కేతన్ మంచి జీవితాన్ని నిర్మించుకోవాలని, పెళ్లి చేసుకుని ఆనందంగా జీవించాలని, మా కళ్ల ముందే వృద్ధుడిగా మారాలని కలలు కన్నాను. కానీ నా చేతులతోనే అతనికి అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది. కేతన్ మరణంతో నా జీవితం శూన్యంగా మారిపోయింది. అతన్ని అత్యంత దారుణంగా హత్య చేశారు. అతనితో పాటే నా ప్రపంచమంతా ముగిసిపోయింది. ఇంట్లో ప్రతి మూల కేతన్‌నే గుర్తు చేస్తోంది. ఒకప్పుడు నవ్వులతో కళకళలాడిన మా ఇల్లు ఇప్పుడు నిశ్శబ్దంగా మారింది. కేతన్ ఇక ఎప్పటికీ తిరిగి రాడనే నిజం ప్రతి రోజూ నన్ను కలచి వేస్తోంది. ఈ విషాదం మా కుటుంబాన్ని పూర్తిగా చిన్నాభిన్నం చేసింది. కేతన్ మరణించిన 20 రోజుల్లోనే మనవడి మరణాన్ని తట్టుకోలేక నా మామగారు ప్రాణాలు కోల్పోయారు. దయచేసి కేతన్‌ను మరో కేసు ఫైల్‌లా మార్చేయొద్దు. అతను ఒకరికి కుమారుడు, ఇంకొకరికి మనవడు, మరొకరికి సోదరుడు. కానీ నాకు మాత్రం అతడే నా ప్రపంచం. ప్రతిరోజూ రాత్రి అతడి ఫొటోతో మాట్లాడుతుంటాను. ఒకరోజు నీకు న్యాయం జరిగిందని కేతన్‌కు చెప్పే అవకాశం వస్తుందని ఆశిస్తున్నా' అంటూ ప్రధాని మోదీకి రాఖీ అగర్వాల్ ఈ-మెయిల్ ద్వారా లేఖ పంపారు. కాగా, పుణెకు చెందిన 26 ఏళ్ల రియల్టర్ కేతన్ అగర్వాల్ జూన్ 18న లోహగడ్ కోట సమీపంలోని లోయలో పడిపోయి మృతిచెందాడు. తొలుత పోలీసులు దీనిని ప్రమాదవశాత్తూ జరిగిన మరణంగా కేసు నమోదు చేశారు. అయితే, దర్యాప్తులో ఇది ముందస్తు ప్రణాళిక ప్రకారం జరిగిన హత్యగా తేలింది. పెళ్లి ఇష్టం లేకపోవడంతో సియా గోయల్ తన ప్రియుడు చేతన్ చౌదరితో కేతన్‌ను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. లోహగడ్ కోటకు విహారయాత్ర పేరుతో తీసుకెళ్లి కేతన్‌ను కొండ పైనుంచి తోసి హత్య చేసినట్లు వెల్లడించారు. దీంతో సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరిని పోలీసులు అరెస్టు చేశారు.



# మాజీ ఎంపీ బుచ్చి మహేశ్వరరావు పరామర్శించిన హర్ష కుమార్, అనురాధ

**అమలాపురం, (రాజధాని వార్తలు):** అనారోగ్యంతో అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీ ఏజేవి బుచ్చి మహేశ్వరరావును మాజీ ఎంపీలు జీవీ హర్షకుమార్, చింతా అనురాధలు పరామర్శించారు. హర్ష కుమార్, అనురాధలు సోమవారం కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి బుచ్చి మహేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. బుచ్చి మహేశ్వరరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరి వెంట గెడ్డం సురేష్ బాబు, గెద్దాడ బుద్ధ రాజ్, గెడ్డం లక్ష్మణరావు, బండి శ్రీరాములు, కొనుకు గౌతమి, బర్రె సీతారత్నం, నక్కా చంద్రశేఖర్, సత్యం కాపు, అంబికా శ్రీను, బర్రె సత్యనారాయణ తదితరులున్నారు.

# దీక్షా – డిజిటల్ విద్యకు దిక్సూచి







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** "నాణ్యమైన విద్యకు డిజిటల్ వేదిక – ప్రతి ఉపాధ్యాయుడికి, ప్రతి విద్యార్థికి" అనే మహోన్నత లక్ష్యంతో భారత ప్రభుత్వం రూపొందించిన వినూత్న విద్యా వేదిక దీక్షా జాతీయ విద్యా విధానం–2020 ఆశయాలను కార్యరూపంలోకి తీసుకు వచ్చేందుకు రూపొందించిన ఈ వేదిక, దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యా పరిపాలనా సిబ్బందికి నాణ్యమైన డిజిటల్ విద్యా వనరులను అందిస్తోంది. బోధనను సాంకేతికతతో అనుసంధానించి విద్యను మరింత ప్రభావవంతంగా, సులభంగా, అందుబాటులోకి తీసుకు రావడంలో దీక్షా కీలక పాత్ర పోషిస్తోంది. దీక్షా వేదికలో ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల వారీగా వీడియోలు, డిజిటల్ పాఠ్యసామగ్రి, బోధనా ప్రణాళికలు, కార్యకలాపాలు, వర్క్‌షీట్లు, మూల్యాంకన సాధనాలు, ఆన్‌లైన్ శిక్షణా కోర్సులు, వెబినార్లు, ఉత్తమ బోధనా పద్ధతులు వంటి అనేక వనరులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలలోని క్యూఆర్ కోడ్లను స్కాన్ చేసి సంబంధిత వీడియోలు, యానిమేషన్లు, చిత్రాలు, అభ్యాస కార్యక్రమాలు, స్వీయ మూల్యాంకన పరీక్షలను సులభంగా వినియోగించుకోవచ్చు. దీంతో తరగతి గదిలో బోధన మరింత సజీవంగా, ఆసక్తికరంగా, అనుభవాత్మకంగా మారుతోంది. దీక్షా ఉపాధ్యాయుల నిరంతర వృత్తి అభివృద్ధికి ఒక విశ్వసనీయ వేదికగా నిలిచింది. వివిధ శిక్షణా కోర్సులను పూర్తి చేసిన అనంతరం డిజిటల్ సర్టిఫికెట్లు కూడా అందించడం ద్వారా ఉపాధ్యాయులను నిరంతర అభ్యాసం వైపు ప్రోత్సహిస్తోంది. కాలానుగుణంగా మారుతున్న విద్యా విధానాలు, నూతన బోధనా పద్ధతులు, సామర్థ్యాధారిత విద్య, పునాది అక్షరాస్యత–సంఖ్యాజ్ఞానం, సమగ్ర మూల్యాంకనం వంటి అంశాలపై ఉపాధ్యాయులు నిరంతరం తమ జ్ఞానాన్ని నవీకరించుకునే అవకాశాన్ని దీక్షా కల్పిస్తోంది.

**ఆంధ్రప్రదేశ్‌లో దీక్షా అమలు - ఒక సమన్వయ కృషి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దీక్షా అమలు దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా వ్యవస్థీకృతంగా చేపట్టబడింది. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర దీక్షా కోఆర్డినేటర్ డా.ఇస్మాయిల్ నాయకత్వంలో రాష్ట్రస్థాయి నిపుణుల బృందం దీక్షా అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. దీక్షా వేదికను ప్రతి ఉపాధ్యాయుడికి చేరువ చేయడం, ప్రతి తరగతి గదిలో డిజిటల్ వనరుల వినియోగాన్ని పెంపొందించడం, విద్యార్థుల అభ్యాసాన్ని మరింత నాణ్యంగా తీర్చిదిద్దడం ప్రధాన లక్ష్యాలుగా ఈ కార్యక్రమం ముందుకు సాగింది. ఈ లక్ష్యాలను సాధించేందుకు రాష్ట్ర బృందం ముందుగా జిల్లా Academic Monitoring Officers (AMOs), జిల్లా దీక్షా కోఆర్డినేటర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించింది. అనంతరం జిల్లా బృందాలు మండల దీక్షా కోఆర్డినేటర్లకు శిక్షణ అందించగా, మండల స్థాయి బృందాలు పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రత్యక్ష శిక్షణలు నిర్వహించాయి. ఈ విధంగా రాష్ట్రం నుంచి పాఠశాల స్థాయి వరకు ఒక సమగ్ర శిక్షణ వ్యవస్థను రూపొందించడం ద్వారా దీక్షా వినియోగం వేగంగా విస్తరించింది. శిక్షణల్లో దీక్షా యాప్‌లో లాగిన్ విధానం, కోర్సుల ఎంపిక, క్యూఆర్ కోడ్ స్కానింగ్, డిజిటల్ కంటెంట్ వినియోగం, ఈ–కంటెంట్ సృష్టి, విద్యార్థుల అభ్యాసంలో దీక్షా పాత్ర, ఉపాధ్యాయుల వృత్తి అభివృద్ధి, డిజిటల్ మూల్యాంకనం వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు కేవలం యాప్‌ను ఉపయోగించడం మాత్రమే కాకుండా, బోధనా ప్రక్రియలో సృజనాత్మకంగా ఉపయోగించే నైపుణ్యాలను కూడా ఈ శిక్షణల ద్వారా పొందారు.

**బలోపేతమైన పర్యవేక్షణ వ్యవస్థ**

దీక్షా అమలు సమర్థవంతంగా కొనసాగేందుకు రాష్ట్రస్థాయిలోనే కాకుండా జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేశారు.

జిల్లా దీక్షా టీమ్‌లు, మండల దీక్ష టీమ్‌లు పాఠశాలలను సందర్శిస్తూ దీక్షా వినియోగాన్ని సమీక్షిస్తున్నాయి. అవసరమైన చోట సాంకేతిక సహాయం అందించడం, ఉపాధ్యా యుల సందేహాలను నివృత్తి చేయడం, కోర్సుల పూర్తి శాతాన్ని పెంచడం, క్యూఆర్‌కోడ్ వినియోగాన్ని ప్రోత్సహించడం, ఉత్తమ పద్ధతులను ఇతర పాఠశాలలకు విస్తరించడం వంటి కార్యక్రమా లను నిరంతరం చేపడుతున్నాయి. ఈ పర్యవేక్షణ వ్యవస్థ వల్ల దీక్షా వినియోగంలో ఎదురయ్యే సమస్యలు వేగంగా పరిష్కారమవుతున్నాయి. రాష్ట్రం నుంచి మండల స్థాయి వరకు ఏర్పడిన సమన్వయ వ్యవస్థ దీక్షా విజయవంతమైన అమలుకు ప్రధాన బలంగా నిలిచింది.

**ఉపాధ్యాయులకు - విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు**

దీక్షా వల్ల ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కొత్త బోధనా పద్ధతులను నేర్చుకునే అవకాశం పొందుతున్నారు. డిజిటల్ పాఠ్యసామగ్రి ద్వారా క్లిష్టమైన అంశాలను సులభంగా బోధించగలుగుతున్నారు. విద్యార్థుల అభ్యాస స్థాయికి అనుగుణంగా కార్యకలాపాలను ఎంపిక చేయడం, మూల్యాంకనం నిర్వహించడం, అభ్యాస లోపాలను గుర్తించడం మరింత సులభమవుతోంది. విద్యార్థులకు పాఠ్యాంశాలు చిత్రాలు, వీడియోలు, యానిమేషన్ల రూపంలో అందడం వల్ల నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతోంది. స్వీయ అభ్యాసం అలవాటుగా మారుతోంది. తరగతి గదికి మాత్రమే పరిమితం కాకుండా ఇంటి నుంచే విద్యా వనరులను ఉపయోగించుకునే అవకాశం కూడా లభిస్తోంది.


**ముగింపు**

దీక్షా ఒక సాధారణ మొబైల్ యాప్ కాదు; ఇది భారత విద్యా వ్యవస్థను డిజిటల్ యుగానికి అనుగుణంగా తీర్చిదిద్దుతున్న జాతీయ విద్యా ఉద్యమం. రాష్ట్రస్థాయి నుంచి పాఠశాల స్థాయి వరకు శిక్షణ, పర్యవేక్షణ, సాంకేతిక సహకారం, నిరంతర మార్గదర్శకత్వం వంటి సమిష్టి కృషి వల్ల ఆంధ్రప్రదేశ్‌లో దీక్షా వినియోగం విశేషంగా అభివృద్ధి చెందుతోంది. రాష్ట్ర దీక్షా కోఆర్డినేటర్ డా.ఇస్మాయిల్ నాయకత్వం, రాష్ట్ర నిపుణుల బృందం కృషి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారులు, జిల్లా దీక్షా కోఆర్డినేటర్లు, మండల కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయుల సమిష్టి సహకారం వల్ల డిక్షా ఉద్యమం గ్రామీణ పాఠశాలల వరకు విజయవంతంగా చేరుకుంది. "దీక్షా వినియోగిద్దాం... డిజిటల్ విద్యను బలోపేతం చేద్దాం... నాణ్యమైన బోధనతో ప్రతి విద్యార్థి భవిష్యత్తును ప్రకాశవంతం చేద్దాం."

**జగన్నాథం రామ మోహన్**
జిల్లా దీక్ష అకాడమిక్ కోఆర్డినేటర్
శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా

# "సర్" ను 5వ డివిజన్లో విజయవంతం చేస్తాం

**- ప్రతి ఓటు ఎంతో విలువైనది ఓటు యొక్క ప్రాధాన్యత ప్రజలకు వివరిస్తున్న మన్సూర్ బ్రదర్స్ - నిర్లక్ష్యం వహిస్తే మీ అమూల్యమైన ఓటు మాయమయ్యే ప్రమాదం - అర్హులైన ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేస్తాం : మన్సూర్ బ్రదర్స్**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు, నెల్లూరు నగరంలోని 5వ డివిజన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మన్సూర్ బ్రదర్స్ డివిజన్లో ఓటర్ సర్వే ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం జులై 14వ తేదీ సంబంధిత వెబ్ సైట్ స్వయంగా మూసివేయబడుతుందని ప్రజలకు తెలియజేస్తూ, ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయడంతో పాటు ఓటు యొక్క విలువను ప్రజలకు తెలియజేస్తూ మంత్రి నారాయణ విజన్– నగరంలో పేదలకు చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరిస్తూ కొత్తగా అర్హత పొందిన వారు ఇతర ప్రాంతాలకు మారిన వారు మరణించిన వారి వివరాలను నిబంధనల ప్రకారం అధికారులతో నమోదు చేయిస్తున్నారు నిర్లక్ష్యం వహిస్తే మీ అమూల్యమైన ఓటు మాయమయ్యే ప్రమాదం ఉందని, కావున ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని డివిజన్ ప్రజలు తమ యొక్క విలువైన ఓటును నమోదు చేయించుకోవాలని స్థానిక ప్రజలకు మన్సూర్ బ్రదర్స్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# "చదువుకు కొత్త ఊపు... బాల్యానికి కొత్త వెలుగు... 'నో బ్యాగ్ డే'!"




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విద్యార్థులు పుస్తకాల భారం నుండి కొంత ఉపశమనం పొందుతూ, ఆనందంగా నేర్చుకునే అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో "నో బ్యాగ్ డే" కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ప్రతి శనివారం 1వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడం ప్రభుత్వం విద్యార్థుల సమగ్ర వికాసంపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనం. జాతీయ విద్యా విధానం–2020, పునాది అక్షరాస్యత మరియు సంఖ్యాజ్ఞానం, సామర్థ్యా ధారిత బోధన వంటి విద్యా సంస్కరణలకు అనుగుణంగా ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు దోహదపడుతోంది. నో బ్యాగ్ డే రోజున విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో కాకుండా ఆటలు, పాటలు, కథలు, కళలు, చేతిపనులు, యోగా, క్రీడలు, పఠన కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కార్యక్రమాలు, విజ్ఞాన ప్రయోగాలు, స్థానిక కళలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటారు. దీనివల్ల పిల్లలు ఒత్తిడి లేకుండా ఆనందంగా నేర్చుకునే వాతావరణం ఏర్పడుతుంది. విద్యార్థుల సహజ ప్రతిభ వెలుగులోకి రావడానికి, అనుభవాత్మక అభ్యాసం ద్వారా నేర్చుకునే అవకాశాలను విస్తరించడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతోంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుంది. జట్టు భావన, నాయకత్వం, సమస్య పరిష్కార నైపుణ్యాలు, కమ్యూ నికేషన్ సామర్థ్యాలు, స్వీయ విశ్వాసం వంటి జీవన నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. పాఠశాల అంటే కేవలం పుస్తకాల అభ్యా సమే కాకుండా, జీవితానికి అవసరమైన విలువలు నేర్చుకునే ప్రదేశమనే భావన బలపడుతుంది. విద్యా రంగంలో నాణ్యతను పెంచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిపుణ్ ఆంధ్ర, FLN, DIKSHA, డిజిటల్ విద్య, ఉపాధ్యాయ శిక్షణ, సామర్థ్యాధారిత బోధన వంటి అనేక సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేస్తోంది.

అదే దిశలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న నో బ్యాగ్ డే కార్యక్రమం విద్యార్థులకు ఆనందదాయకమైన, ఒత్తిడిలేని మరియు అనుభవాధారిత విద్యను అందించే గొప్ప విద్యా సంస్కరణగా నిలుస్తోంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టిగా కృషి చేస్తున్నారు. పిల్లల ఆసక్తులు, సామర్థ్యాలను గుర్తించి వాటిని ప్రోత్సహించేలా పాఠశా లల్లో వినూత్న కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం. "ఆనందంగా నేర్చుకునే బాలలే రేపటి ఆత్మవిశ్వాసంతో కూడిన భారత పౌరులు" అనే లక్ష్యంతో ప్రతి శనివారం 1వ తరగతి నుండి 9వ తరగతి వరకు అమలు చేస్తున్న నో బ్యాగ్ డే కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనం. విద్యార్థుల సమగ్ర వికాసాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం రాష్ట్ర విద్యా రంగాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని ఆశిద్దాం.

**జగన్నాథం రామ మోహన్**
స్టేట్ రిసోర్స్ పర్సన్

# న్యాయ విద్యార్థులకు ప్రత్యేక పునర్మూల్యాంకనం

**- రీ-వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసిన వారికే అవకాశం..**

**వారం రోజుల్లో ఫలితాలు : వీఎస్‌యూ వీసీ**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) పరిధిలోని మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సు విద్యార్థులకు ప్రత్యేక పునర్మూల్యాంకనం నిర్వహించాలని విశ్వవిద్యాలయం నిర్ణయించింది. ఇప్పటికే రీ–వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల జవాబు పత్రాలను మరోసారి స్వతంత్ర మూల్యాంకనకర్తలతో పరిశీలించి తుది ఫలితాలను ప్రకటించనున్నట్లు వైస్–చాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల ప్రకటించిన పరీక్షా ఫలితాల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు అనుత్తీర్ణులు కావడంతో సుమారు 172 మంది రీ–వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అయితే రీ–వాల్యుయేషన్ అనంతరం కేవలం 16 మాత్రమే ఉత్తీర్ణులుగా ప్రకటించబడటంతో మూల్యాంకన విధానంపై విద్యార్థులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ విశ్వవిద్యాలయ అధికారులను కలిసి న్యాయం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో స్పందించిన వీసీ, ఇప్పటికే రీ–వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థుల జవాబు పత్రాలను మరో ఇద్దరు స్వతంత్ర మూల్యాంకనకర్తలతో మూడో, నాలుగో మూల్యాంకనాలకు పంపిస్తున్నట్లు వెల్లడించారు. ఈ రెండు మూల్యాంకనాల్లో వచ్చిన మార్కుల్లో సరాసరి మార్కులను పరిగణనలోకి తీసుకుని తుది ఫలితాలను ప్రకటిస్తామని చెప్పారు. పునర్మూల్యాంకన ప్రక్రియను పూర్తిగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, నిర్వహిస్తామని, వారం రోజుల్లో సవరించిన ఫలితాలను విడుదల చేస్తామని వీసీ హామీ ఇచ్చారు. ఈ ప్రత్యేక పునర్మూల్యాంకనానికి ఎలాంటి అదనపు రుసుము వసూలు చేయబోమని, ఇప్పటికే రీ–వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం వర్తిస్తుందని స్పష్టం చేశారు. కొత్తగా ఎలాంటి దరఖాస్తులను స్వీకరించబోమని తెలిపారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని, ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా పునర్మూల్యాంకన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# సర్ కార్యక్రమంలో పాల్గొన్న గాలి మురళి నాయుడు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలంలో వున్న దిగువ కొనతనేరి పంచాయితీలో బిఎల్‌ఓ, బిఎల్‌ఏలు నిర్వహించిన గ్రామసభలో మండల టిడిపి మాజీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఓటరు లిస్టును క్షుణ్ణంగా పరిశీలించి అనర్హులైన వారిని, చనిపోయిన వారిని తొలగించి, అర్హులైన వారిని చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకయ్య, పంచాయితీ కార్యదర్శి చంద్రిక, అంగన్వాడీ టీచర్ భారతి, స్కూల్ టీచర్ మౌనిక, జనమాల రాజయ్య, బాబు, శివ పాల్గొన్నారు.



# సంపాదకీయం

## 'సర్'.. ఏ అసమర్థతలకు చిహ్నం?

మనం జ్ఞానం పొందటంలో ప్రత్యక్ష అనుభవానికి మించింది మరొకటి ఉండదు. అన్ని విషయాల్లో ఇది సాధ్యం కాకపోయినా రాజకీయాల్లో ప్రత్యక్ష అనుభవానికి ఉన్న పాత్ర చాలా ఎక్కువ. ఓటర్ల జాబితాను సమూలంగా ప్రక్షాళించటానికి ఉద్దేశించిన (సర్) ప్రక్రియ జరుగుతున్న తీరుతెన్నులను చూస్తుంటే ప్రజల ప్రత్యక్ష అనుభవం చెబుతున్న పాఠాలు చాలా కఠోరంగా ఉంటున్నాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఇంకో రెండేళ్ల తర్వాతే జరుగుతాయి. బిహార్, బెంగాల్, తమిళనాడులో లాగా ఎన్నికల ముందు హడావుడిగా ఇక్కడ సర్ చేపట్టలేదు. అంతవరకూ కాస్త ఉపశమనమే. కానీ తెలంగాణలో ఇప్పుడు జరుగుతున్న దాన్ని, ఓటర్లలో నెలకొన్న అనేక సందేహాలను, వాళ్ల స్వయంగా సేకరించాల్సిన సమాచారాన్ని, వెలికి తీయాల్సిన పత్రాలను దృష్టిలో పెట్టుకుంటే.. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆ మూడు రాష్ట్రాల్లో ఏం జరిగిందో, దానికి మూల్యం ఎవరు చెల్లించారో అర్థం చేసుకోవటం కష్టం కాదు. సర్ నిబంధనల ప్రకారం బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) మూడుసార్లు ఓటర్ల ఇళ్లకు వెళ్లాలి. ఇది ప్రాథమిక నియమం. నగరాలు, పట్టణాల్లో అది అమలవుతున్న ప్రాంతాలను వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఒక్కసారి కూడా రాని ప్రాంతాలు వందల్లో ఉంటాయి. అయినా అంతా సజావుగా సాగుతోందని ఎన్నికల కమిషన్ గొప్పగా చెబుతోంది. ప్రజలందరి చేతుల్లో మొబైల్ ఫోన్లు ఉండి, సామాజిక మాధ్యమం నిఘా విస్తృతంగా ఉన్న నేపథ్యంలో బీఎల్ఓలు ఒక్కచోటే కూర్చొని ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న దృశ్యాలు వందలు కనపడుతున్నాయి. ఇది అంతవరకే అయిపోలేదు. పూర్తిచేసిన ఫారాలను కూడా ఓటర్లే మళ్లీ బీఎల్ఓల వద్దకు వెళ్లి సమర్పించుకునే పరిస్థితే చాలా చోట్ల ఉంది. సర్ ప్రక్రియలో ప్రాథమిక అడుగే సరిగా పడలేదని దీన్నిబట్టి తేలికగానే అర్థం అవుతుంది. అయినా మన యంత్రాంగం సమర్థత బ్రహ్మాండంగా ఉందని మనం సరిపెట్టుకోవాలి. అంతా సజావుగా నడుస్తోందని మనకుమనమే సర్దిచెప్పుకోవాలి. నియమాలు ఘనంగా, అమలు హీనంగా ఉండటం అనేది మన ప్రభుత్వాల సహజ లక్షణంగా భావిస్తేనే అలా చేయగలం. ముఖ్యంగా అట్టడుగు, మధ్యతరగతి వర్గాలకు వచ్చేసరికి ఎన్నో చట్టాలు, నియమాల పరిస్థితి ఇదే తీరులో ఉంటోంది. అందుకే ఏ ప్రక్షాళనలోనైనా నష్టపోయేది ఈ వర్గాలే. కొత్తగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదుచేయటానికి ఎన్నో పత్రాలు చూడాలి. స్వయంగా బీఎల్ఓ ఆ వ్యక్తి నివసించే ఇంటిని సందర్శించాలి. ఆషామాషీగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదు చేయకూడదనేది నియమం. ఆ నియమాన్ని కచ్చితంగా పాటించే.. ఓటర్లుగా నమోదు చేశామని చెప్పే ఎలక్షన్ కమిషన్ తాను జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డులనే సర్‌లో ప్రామాణికంగా తీసుకోలేమని సుప్రీంకోర్టుకు స్వయంగా చెప్పింది. అలాగే ఆధార్ కార్డూ అందుకు ఉపయోగపడదని తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టూ చివరకు ఎలక్షన్ కమిషన్ వాదననే పరిగణనలోకి తీసుకుంది. ఆధార్ కార్డుని విదేశీవ్యక్తులకు కూడా జారీచేస్తారని, అందుకే అది ప్రామాణికం కాదనే వాదన ఎంత లోపభూయిష్ఠమో మన ఇంగితజ్ఞానం చెబుతూనే ఉంటుంది. ఎంతమంది విదేశీయులకు అధికారికంగా ఆధార్ కార్డులు జారీ అయి వుంటాయో లెక్కలుతీస్తే వారి సంఖ్య చాలా పరిమితంగానే ఉంటుంది. వాళ్లు అయినా కొన్ని పత్రాలు సమర్పించకుండా కార్డులు పొందలేరు. అతి స్వల్పసంఖ్యలో విదేశీయులు ఆధార్ పొందుతుంటే మొత్తం ఆధార్ కార్డుల ప్రామాణికతనే శంకించటం సామాన్యుల తర్కానికి అందదు. పర్యాటకులుగానో, విద్యార్థులుగానో, ఉద్యోగులుగానో, పరిశోధకులుగానో వచ్చిన విదేశీ వ్యక్తులకు ఆధార్ ఇవ్వాలన్న నిబంధనను అధికారికంగానే పెట్టుకుని ఈ వాదనను చేయటం విడ్డూరంగానూ, వైపరీత్యంగానూ భావించాలి. ఇక ఇతర దేశాల సరిహద్దులను దాటి దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవాళ్లు ఆధార్ కార్డులు పొందటం ఎక్కువగానే ఉందని అనుకుందాం. మరి అందుకు కారణం ఎవరు? అని ప్రశ్నించుకుంటే వేళ్లన్నీ అధికారయంత్రాంగం వైపే చూపుతాయి. పోనీ వీళ్లు అయినా కేంద్ర మంత్రులు ప్రచారం చేస్తున్నట్లు కోట్లలో ఉన్నారా? సరిహద్దు రాష్ట్రాలన్నీ అక్రమ వలసదారులతో నిండిపోతున్నాయా? అని పరిశీలిస్తే అలాంటి భయానక దృశ్యం కనపడదు. అసాంలో 2025--26లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను (స్పెషల్ రివిజన్) చేపట్టారు. ఆ సందర్భంగా తొలగించిన ఓట్లు 2,43,485 మాత్రమే. వీళ్లల్లో చనిపోయిన వారితో పాటు రెండుచోట్ల ఓట్లున్న వారి పేర్లూ ఉన్నాయి. పోనీ ఇందులో సందేహాస్పద ఓటర్లు ఎంతమందో అధికారికంగా ప్రకటించనూలేదు. అలా ప్రకటిస్తే కనీసం అక్రమవలసదారుల గురించి ఒక అవగాహన ఏర్పరచుకునే అవకాశం ఉండేది. సందేహాస్పద ఓటర్లందరినీ మనం అక్రమ వలసదారులుగా భావించలేం. బీఎల్ఓలకు సరైన పత్రాలను అందించలేని వాళ్లనూ ఆ జాబితాలో చేర్చుతారు. ఇంకో విషయాన్ని చూసినా అక్కడి అసలు పరిస్థితి ఏమిటో అర్థమవుతుంది. 1997 నుంచి 2023 వరకూ అసాంలో మొత్తం 2,44,144 మందిని అనుమానాస్పద ఓటర్లుగా భావించి వారి పౌరసత్వాన్ని తేల్చటానికి ఫారెన్ ట్రైబ్యునళ్లకు నివేదించారు. వీళ్లందరూ అక్రమ వలసదారులే అనుకున్నా మొత్తం ఓటర్లలో వారు ఒక శాతం మాత్రమే ఉంటారు. కానీ వీళ్లల్లో 51,505 మందిని మాత్రమే విదేశీయులుగా తేల్చారు. మరికొందరిని భారతీయులుగానే పరిగణించారు. కొన్ని కేసులు ఇంకా ట్రైబ్యునళ్లలో నడుస్తున్నాయి. రాజకీయ లబ్ధికోసం చేసే ఆర్భాటప్రకటనలకూ వాస్తవాలకూ మధ్య దూరం మామూలుగా ఉండదని దీన్నిబట్టి స్పష్టం అవుతోంది.

# 30వ వార్డులో వైసీపీకి భారీ షాక్ - జనసేనలోకి 100 మంది చేరిక







**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దక్షిణ నియోజక వర్గం 30వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో, 30వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షురాలు యజ్ఞశ్రీ ఆధ్వ ర్యంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభు త్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు స్వాగతిస్తున్నప్పటికీ, వాటిని వ్యతిరేకించడమే వైసీపీ ఏకైక అజెండాగా మార్చుకుందని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న జనసేన పార్టీ విధానాలు తమను ఆకర్షించాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్ల అప్పయ్య యువజన సంఘం, జేపీ యంగ్ బాయ్స్ సభ్యులు పెద్ద ఎత్తున జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. తక్కువ కాలంలోనే దక్షిణ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి, అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. మత్స్యకారుల సమస్యల విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఖరిని విమర్శిస్తూ, గల్లంతైన మత్స్యకారుల ఘటన జరిగిన ఇన్ని రోజుల తర్వాత ఇప్పుడు వారిపై ప్రేమ చూపించడం ప్రజలను మోసం చేయడమేనని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి నందు స్వామి, కే. వీర్రాజు, నోళ్లు వెంకటేష్, చింతపల్లి సతీష్, కదరి నూకరాజు, మద్దు సతీష్, మద్దు నూకరాజు, అల్లిపిల్లి అఖిల్, ఎర్రిపెల్లి సంతోష్, రాయి గణేష్, వాడ మధు, నూకరాజు, తెడ్డు యశ్వంత్, రాయి హేమంత్, నారాయణమ్మ, జయ, రజిని, జ్యోతి, సూరమ్మ, వరలక్ష్మీ, ధనలక్ష్మి, పద్మ, భాగ్యలక్ష్మి, రమాదేవి తదితరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. కార్యక్రమంలో జనసేన శ్రేణులు చింతపల్లి జోగిరాజు వార్డు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# చేతివృత్తులను ఆదరించండి...హస్త కళలను ప్రోత్సహించండి

## - ఆల్ ఇండియా క్రాఫ్ట్ బజార్ ప్రారంభించిన ఎమ్మెల్యే వెలగపూడి







**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన చేతి వృత్తులను ఆదరించాలని హస్త కళలను ప్రోత్సహించాలని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు పిలుపునిచ్చారు. సోమవారం ఇక్కడ కరక చెట్టు పోలమాంబ ఆలయం వద్ద ఆలిండియా క్రాఫ్ట్ బజార్‌ను ముఖ్యఅతిథిగా హాజరై వెలగపూడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 రాష్ట్రాలకు చెందిన చేతివృత్తులు హస్తకళలు. చేనేత వస్తువులు ఉత్పత్తి ధరలకే విక్రయిస్తుండడంతో వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వినియోగదారులు అందిస్తున్న అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆల్ ఇండియా క్రాఫ్ట్ బజార్ పేరుతో దేశంలోనీ వివిధ ప్రాంతాల్లో లభ్యమయ్యే వస్తువులను ఒకే చోటకు తీసుకువచ్చి ప్రదర్శించడం విక్రయించడం వల్ల అన్ని వస్తువులను ఒకే చోట సందర్శించి తక్కువ ధరలకు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ తక్కువ ధరకు లభ్యమయ్యే ఈ బజార్‌ను ప్రజలు ఉచితంగానే తిలకించవచ్చునన్నారు. అలాగే నాణ్యమైన చీరలు. గృహోపకరణాలకు అవసరమయ్యే సామగ్రి అంతా ఇక్కడ అందుబాటులో ఉందన్నారు. కావున ఆయా ప్రాంతాల ప్రజలు ఆలిండియా క్రాఫ్ట్ బజార్‌ను సందర్శించాలని గంట్ల శ్రీను బాబు కోరారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు విశాఖ ఆర్టీసియన్స్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు మొహమ్మద్ నసీం మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో హైదరాబాద్ నుంచి ముత్యాలు కలంకారి పెయింట్స్ రాజస్థాన్ బెడ్ షీట్స్ బెంగాల్ కాటన్ సారీస్ కాటన్ డ్రెస్ మెటీరియల్ మైసూర్ రోజ్ వుడ్‌తో పాటు అనేక రకాల వస్తువులను అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రదర్శన ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు. తక్కువ ధరకు నాణ్యమైన వస్తువులను కొనుగోలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో పోలమాంబ ఆలయ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మద్ది శ్రీనివాస్ రెడ్డి తెలుగుదేశం పార్టీ మైనారిటీ విశాఖ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రహీమతుల్లా తదితరులు పాల్గొన్నారు. వీరంతా తొలుత క్రాఫ్ట్ బజార్ ను సందర్శించి నిర్వాహకులను అభినందించారు. అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

# ఉత్తరాంధ్రలో ఓబీసి కాంగ్రెస్ బలోపేతంపై హర్షం వ్యక్తం చేసిన సిడబ్ల్యూసి మెంబర్ చల్లా వంశీ చంద్ రెడ్డి

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** అయోధ్య రామాలయం విరాళాల అవకతవకలపై విశాఖపట్నం మీడియా సమావే శానికి విచ్చేసిన సిడబ్ల్యూసి మెంబర్ చల్లా వంశీ చంద్ రెడ్డి ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర ఓబీసీ కాంగ్రెస్ కాంగ్రెస్ టీమ్‌ని చూసి సంతోషంతో ఇదేవిధముగా రాష్ట్రం అంతా ఓబీసీతో సహా మిగతా సెల్స్ కూడా కమిటీలు బలోపేతం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రటరీ కేవీ. సూర్యనారాయణ, స్టేట్ సెక్రటరీ కాళ్ళ సత్యనారాయణ, విశాఖ ఓబీసీ అధ్యక్షులు కొండవలస శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొంతురమణ, మన్యం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, భాస్కర్ రావు, మైనారిటీ నాయకులు హరసద్ బాషా, విశాఖ ఈస్ట్ అధ్యక్షులు బీవీ. శ్రీనివాసరావు, సౌత్ అధ్యక్షులు గుట్టం




కనకరాజు, వెస్ట్ అధ్యక్షులు మొల్లి సీతరామరాజు, నర్సీపట్నం అధ్యక్షులు మణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంచి ఫలితాలకు సమన్వయం అవసరం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** స్వర్ణ గ్రామ డిప్యూటీ ఎంపీడీవోలు వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుని పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కెఎన్‌వి ప్రసాదరావు అన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన స్వర్ణ గ్రామ డిప్యూటీ ఎంపీడీఓలకు విస్తరణ శిక్షణా కేంద్రంలో 30 రోజుల పాటు జరిగే ప్రాథమిక శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. పరిపాలనలో వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. సరైన ప్రణాళిక, సమష్టి పనితీరుతో ఉద్యోగం సులువుగా చేయొచ్చని అన్నారు. క్షేత్ర స్థాయిలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు విభాగం పాత్ర కీలకమన్నారు. ఆ స్వర్ణ గ్రామ డిప్యూటీ ఎంపీడీఓలు ప్రజలకు సేవలు అందించాలని ప్రిన్సి పల్ కోరారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ జి రమణ, డిడిఓ శర్మ, ఎంపీడీఓలు శేషుబాబు, సుశీల, డిప్యూటీ ఎంపీడీఓలు చిన్నబ్బులు, చక్రపాణి, ఫ్యాకల్టీ సభ్యులు రవిశంకర్, నీహారిక, జగన్నాథం, వివిధ జిల్లాల నుంచి వచ్చిన డిప్యూటీ ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# రివిట్మెంట్ వాల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముక్కామల నుండి ఈదరపల్లి వరకు జాతీయ రహదారి-216 ఈకు ఆనుకుని ఉన్న ప్రధాన పంట కాలువ రివిట్మెంట్ వాల్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సిరిపల్లి వద్ద జిల్లా కలెక్టర్ జాతీయ రహదారి-216ఈ అధికారులతో కలిసి రివిట్మెంట్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై ఆరా తీశారు. ముక్కామల-ఈదరపల్లి ప్రధాన పంట కాలువ ద్వారా సరఫరా జరిగే సాగునీటిపై ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తున్నారని ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని కలెక్టర్ అన్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కాలువ గట్టు కృంగి పోతున్న నేపథ్యంలో రివిట్మెంట్ వాల్ నిర్మాణం చేపట్టడం వల్ల కాలువకు రక్షణ కల్పించడంతో పాటు రైతుల ప్రయోజనాలు కూడా పరిరక్షించబడతాయని అన్నారు. ప్రధాన కాలువ వెంట రివిట్మెంట్ వాల్ ఏర్పాటు చేయడం ద్వారా జాతీయ రహదారి భద్రత మరింత మెరుగుపడటంతో పాటు వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ఉంటుందని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే డీఈలు, కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రశ్న రావణ్‌పై పెట్టిన ఉప కేసును ఎత్తివేయాలి : వి.సి.కె పార్టీ డిమాండ్

**అమలాపురం, (రాజధాని వార్తలు):** సామాన్య యూట్యూబర్ ప్రశ్న రావణ్‌పై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని విసికె పార్టీ నిరసన ప్రదర్శన చేపట్టింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నిస్తున్నాడనే నెపంతో పలు కేసులు పెట్టినప్పటికి కోర్ట్ బెయిల్ మంజూరు చేయడంతో ప్రభుత్వం కక్ష సాధింపు చర్యగా తీవ్రవాదులపై పెట్టే సెక్షన్‌లు ఉప కేస్‌ను రావణ్‌పై పెట్టడాన్ని వి.సి.కె పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నిస్తున్న సామాన్య పౌరులపై ఇటువంటి కేసులు పెట్టి ప్రభుత్వాన్ని ప్రశ్నించే వాళ్ళు నోరు నొక్కాలని చూస్తున్న తీరును వి.సి.కె పార్టీ ఖండిస్తుందన్నారు. ప్రశ్న రావణ్‌ను తక్షణమే విడుదల చేయాలి అని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం వి. సి. కె పార్టీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టి కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వి.సి.కె పార్టీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ బొంతు రమణ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు మెండి డేవిడ్ అంబేద్కర్, జిల్లా సెక్రటరీ కాశీ సాయి కుమార్, జిల్లా యూత్ అధ్యక్షులు పొలమూరి సందీప్, వెన్నపు దొరబాబు, సాపే రమేష్, జల్లి నరేష్, జల్లి అజయ్, నక్క రామ్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# జై హనుమాన్.. వర్మ సెలెక్షన్ వర్త్ మామ వర్తూ!



హనుమాన్ మూవీతో పాన్ ఇండియా రేంజ్‌లో సంచలనం సృష్టించిన దర్శకుడు ప్రశాంత్ వర్మ.. ఇప్పుడు తన సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న చిత్రం జై హనుమాన్. ఆ సినిమాకు సంబంధించి ఒక్కో అప్డేట్ బయటకు వస్తున్న కొద్దీ అంచనాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా క్యాస్టింగ్ సెలక్షన్ చూస్తే.. ప్రశాంత్ వర్మ ఆ ప్రాజెక్టును ఎంత జాగ్రత్తగా ప్లాన్ చేశారో అర్థమవుతోందని టాక్ వినిపిస్తోంది. సినిమా హనుమంతుడి పాత్రలో కన్నడ నటుడు రిషబ్ శెట్టి కనిపించనున్నారు. కాంతారతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న రిషబ్.. డివోషనల్, ఎమోషన్స్ ఎలిమెంట్స్‌తో కూడిన పాత్రలను ఎంతో నేచురల్‌గా చూపించగల నటుడిగా ఇప్పటికే ప్రూవ్ చేసుకున్నారు. అలాంటి యాక్టర్ మూవీలో హనుమంతుడి పాత్రలో కనిపించనున్నాడనే విషయం సినిమాకు ఫస్ట్ స్ట్రెంత్‌గా మారింది. మరోవైపు హనుమాన్ సినిమాలో ప్రేక్షకులను ఆకట్టుకున్న తేజ సజ్జ రోల్‌ను జై హనుమాన్‌లో కూడా వర్మ కొనసాగించనున్నారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో ఆయన రోల్‌కు ఉన్న ఇంపార్టెన్స్ దృష్ట్యా, ఈసారి మరింత పెద్ద బాధ్యతతో కనిపించే అవకాశముందని అభిమానులు భావిస్తున్నారు. ఇక రానా దగ్గుబాటి ఎంట్రీ ఆ ప్రాజెక్టుకు మరో పెద్ద ఆకర్షణగా మారింది. అధికారికంగా ఆయన రోల్ ను ఇంకా ప్రకటించకపోయినా, కథలో అత్యంత కీలకమైన పాత్రలో కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. హీరో, విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్.. ఏ పాత్రలో అయినా అదరగొట్టే రానా సినిమాకు స్పెషల్ అసెట్‌గా మారతారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, డైలాగ్ డెలివరీ, భారీ పర్సనాలిటీని పౌరాణిక కథలకు బాగా సరిపోతాయని అభిమానులు భావిస్తున్నారు. ఇక్కడే ప్రశాంత్ వర్మ ఆలోచన క్లియర్‌గా కనిపిస్తోందని అనేక మంది సినీ ప్రియులు అంటున్నారు. ఒకవైపు పౌరాణిక పాత్రలకు నేచురాలిటీ తీసుకురాగల రిషబ్, మరోవైపు తన యూనివర్స్ కు పరిచయమైన తేజ, ఇంకోవైపు పవర్ ఫుల్ స్క్రీన్ ఇంపాక్ట్ ఉన్న రానా.. ఇలా ముగ్గురు విభిన్న శైలుల నటులను ఒకే కథలో కలపడం సూపర్ అనే చర్చ జరుగుతోంది. హనుమాన్ తర్వాత దాదాపు రెండేళ్లపాటు స్క్రిప్ట్ పై ప్రశాంత్ వర్మ పనిచేసినట్లు సమాచారం. అందుకే క్యాస్టింగ్ సెలక్షన్‌లో కూడా ఆయన ఎలాంటి రాజీ పడలేదని తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఆ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూళ్లు ఇప్పటికే పూర్తవగా, అన్ని పనులు అనుకున్నట్లే సాగితే 2027 సెకండాఫ్‌లో మూవీని విడుదల చేయాలనే ప్రణాళిక ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏదేమైనా జై హనుమాన్‌పై అంచనాలు పెరగడానికి కారణం భారీ బడ్జెట్ లేదా విజువల్స్ మాత్రమే కాదు. క్యాస్టింగ్ ఎంపిక చేయడంలో ప్రశాంత్ వర్మ చూపిస్తున్న ఆలోచనే సినిమాకు అతిపెద్ద ప్లస్ పాయింట్‌గా మారుతోంది. అందుకే ప్రశాంత్ వర్మ సెలెక్షన్ వర్త్ మామ వర్తూ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

# రిస్క్‌తోనే నయా హిస్టరీ.. అల్లు బాస్ కొత్త ప్లాన్!



టాలీవుడ్‌లో పెద్ద విజయాలు సాధించిన చాలా సినిమాల వెనుక ఒక పెద్ద రిస్క్ ఉంటుంది. అందరూ సేఫ్ గేమ్ ఆడుతున్న సమయంలో.. ఎవరూ ఊహించని కథలు, కొత్త టెక్నాలజీ, విభిన్న ఆలోచనలతో ముందుకు వచ్చిన నిర్మాతలే ఇండస్ట్రీలో కొత్త ట్రెండ్‌లకు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు అదే కోవలో గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ మరో రిస్క్‌తో కూడిన నిర్ణయం తీసుకోబోతున్నారనే టాక్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. అల్లు అరవింద్ కెరీర్‌ను అబ్జర్వ్ చేస్తే.. మార్కెట్ ఎలా మారుతుందో ముందే అంచనా వేసి అడుగులు వేయడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కొత్త దర్శకులను ప్రోత్సహించడం, భారీ విజన్ ఉన్న కథలకు అవకాశం ఇవ్వడం, చిన్న సినిమాలను ముందుకు తీసుకెళ్లడం, ప్రేక్షకుల టేస్ట్ ముందుగానే అర్థం చేసుకోవడం ఆయన బలంగా చెప్పుకుంటారు. అందుకే గీతా ఆర్ట్స్ నుంచి వచ్చే చాలా ప్రాజెక్టులు ఎప్పుడూ కొత్త చర్చకు దారి తీస్తుంటాయి. ప్రస్తుతం భారతీయ సినిమా మార్కెట్‌లో మైథాలజీ, ఇతిహాసాలు, భారతీయ సంస్కృతికి సంబంధించిన కథలకు మంచి ఆదరణ కనిపిస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్‌తో భారీ స్థాయిలో రూపొందుతున్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఇదే సమయంలో యానిమేషన్ రంగం కూడా క్రమంగా కొత్త దిశగా అడుగులు వేస్తోంది. చిన్నారులకే పరిమితమన్న అభిప్రాయం నుంచి బయటపడి, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే కథల కోసం సినీ పరిశ్రమ ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఇలాంటి ప్రాజెక్టుల్లో రిస్క్ కూడా అదే స్థాయిలో ఉంటుంది. యానిమేషన్ అంటే భారీ పెట్టుబడి, ఎక్కువ నిర్మాణ సమయం, అత్యున్నత సాంకేతిక నైపుణ్యం అవసరం. కథ బలంగా లేకపోయినా, విజువల్స్ ఆశించిన స్థాయిలో లేకపోయినా పెట్టిన పెట్టుబడి తిరిగి రావడం కష్టమే. అందుకే ఇలాంటి ప్రయోగాలకు చాలామంది నిర్మాతలు వెనకడుగు వేస్తుంటారు. కానీ అల్లు అరవింద్ మాత్రం కొత్త దారులు వెతకడంలో వెనుకాడరనే పేరు సంపాదించుకున్నారు. మార్కెట్‌లో ట్రెండ్ ఏంటన్నదానికంటే.. రేపటి ట్రెండ్ ఎలా ఉండబోతుందో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారనే అభిప్రాయం ఇండస్ట్రీలో ఉంది. అదే ఆలోచనతో మరోసారి కొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నారనే ప్రచారం ఇప్పుడు ఆసక్తి రేకెత్తిస్తోంది. అధికారిక ప్రకటన ఇంకా వెలువడకపోయినా.. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం గీతా ఆర్ట్స్ కాళీమాత కథాంశంతో భారీ యానిమేషన్ చిత్రాన్ని రూపొందించే దిశగా అడుగులు వేస్తోందట. స్క్రిప్ట్ వర్క్ కూడా పూర్తయిందనే ప్రచారం సాగుతోంది. గతంలో కాళీమాత కథలతో పెద్ద కమర్షియల్ విజయాలు లేకపోయినా.. అత్యాధునిక యానిమేషన్, ప్రపంచ స్థాయి విజువల్స్, బలమైన ఎమోషన్‌తో ఆ కథను కొత్తగా చూపించాలని భావిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఆ ప్రచారం నిజమై, ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లి.. రిలీజ్ అయ్యి ప్రేక్షకులను మెప్పిస్తే.. అది కేవలం మరో సినిమా విజయమే కాదు. రిస్క్‌తోనే నయా హిస్టరీ సృష్టించాలన్న అల్లు బాస్ కొత్త ప్లాన్ సక్సెస్ అయినట్లే అని ఇప్పుడు అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఎన్టీఆర్ ఆఫీస్ నుంచి అఫీషియల్ క్లారిటీ.. వాళ్ళతో సంబంధం లేదట



సోషల్ మీడియా వాడకం పెరిగిన తర్వాత సినీ ప్రముఖుల పేరుతో ఎన్నో రకాల సంస్థలు, అకౌంట్లు పుట్టుకొస్తున్నాయి. ఇందులో కొన్ని అధికారికంగా ఉంటే ఇంకొన్ని ఎలాంటి పర్మిషన్ లేకుండా నడుస్తుంటాయి. ఇటీవల టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ పేరుతో కూడా ఒక సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆయన బృందం గుర్తించింది. RAW NTR అనే పేరుతో నడుస్తున్న ఈ సంస్థ డైరెక్ట్‌గా ఎన్టీఆర్‌కు సంబంధించినది అనే భావన కలిగించేలా వ్యవహరిస్తున్నట్లు వాళ్ళ దృష్టికి వచ్చింది. దీనిపై ఫ్యాన్స్‌లో ఎలాంటి కన్ఫ్యూజన్ ఉండకూడదనే ఉద్దేశంతో ఆయన టీమ్ ఒక ప్రెస్ నోట్ ద్వారా పూర్తి వివరాలు వెల్లడించింది. ఈ వ్యవహారంపై వస్తున్న వార్తలకు చెక్ పెడుతూ ఎన్టీఆర్ కార్యాలయం నుంచి ఒక అధికారిక ప్రకటన విడుదలైంది. అందులో చాలా క్లియర్‌గా ఆ సంస్థతో తమకు ఉన్న ఈక్వేషన్ ఏంటో చెప్పారు. రా ఎన్టీఆర్ అనే సంస్థతో కానీ వాళ్లు చేసే కార్యక్రమాలతో కానీ ఎన్టీఆర్ కు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. ఎవరైనా ఆ పేరు చూసి మోసపోకూడదనే ఉద్దేశంతో ఆయన ఆఫీస్ కు కూడా ఈ సంస్థతో ఎలాంటి అనుబంధం, అనుమతి లేదా ప్రమేయం లేదని ఆ లెటర్‌లో క్లియర్‌గా మెన్షన్ చేశారు. ఒక హీరో ఇమేజ్‌ను ఉపయోగించుకుని కార్యక్రమాలు చేసేటప్పుడు కచ్చితంగా లీగల్‌గా కొన్ని రూల్స్ ఉంటాయి. వాటిని ఉల్లంఘిస్తూ పని చేస్తున్న ఆ సంస్థకు ఎన్టీఆర్ తరఫున ప్రాతినిధ్యం వహించే హక్కు ఏమాత్రం లేదని ఆఫీస్ బృందం వెల్లడించింది. ఆయన పేరు మీద ఎలాంటి ప్రకటనలు చేయడానికి కానీ, ఈవెంట్స్ నిర్వహించడానికి కానీ వాళ్లకు ఎలాంటి అధికారం లేదని తమ స్టేట్మెంట్‌లో స్ట్రాంగ్‌గా పేర్కొన్నారు. ఇకపై ఎన్టీఆర్‌కు సంబంధించిన ఏదైనా సమాచారం బయటకు రావాలంటే అది కేవలం అఫిషియల్‌గా వస్తుందని టీమ్ ఒక క్లారిటీ ఇచ్చింది. ఏదైనా సేవా కార్యక్రమం, ఏదైనా ఈవెంట్స్ గురించి చెప్పాలన్నా ఆయన అధికారిక బృందం ద్వారా మాత్రమే క్లారిటీ వస్తుందని వివరణ ఇచ్చారు. అలా కాకుండా అనధికారిక వ్యక్తులు, సంస్థల ద్వారా వచ్చే సమాచారాన్ని గానీ ప్రకటనలను గానీ అఫిషియల్‌గా తీసుకోవద్దని అభిమానులకు ఒక సూచన చేశారు. ఈ రా ఎన్టీఆర్ ఇష్యూ మీద భవిష్యత్తులో మళ్లీ ఎలాంటి చర్చ రాకుండా ఉండేలా ఇదే తమ ఫైనల్ స్టేట్మెంట్ అని ఎన్టీఆర్ ఆఫీస్ ప్రకటించింది. ఈ ఒక్క వివరణతో ప్రస్తుతానికి సోషల్ మీడియాలో జరుగుతున్న ఊహాగానాలు, వదంతులకు పూర్తిగా ఎండ్ కార్డ్ పడుతుందని తాము ఆశిస్తున్నట్లు వారు తెలిపారు. డిజిటల్ ప్లాట్ ఫామ్స్ తో పాటు మీడియా వేదికలు కూడా అఫీషియల్ సోర్సెస్ ద్వారా వచ్చే న్యూస్ మాత్రమే నమ్మాలని, ఫేక్ సమాచారాన్ని ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. చివరగా అభిమానులు చూపిస్తున్న నిరంతర ప్రేమకు, ఇస్తున్న మద్దతుకు కృతజ్ఞతలు అని వివరణ ఇచ్చారు. హీరోల పేరు మీద ఇలాంటివి జరిగినప్పుడు సంబంధిత వ్యక్తులు సైలెంట్‌గా ఉంటే అది రాబోయే రోజుల్లో పెద్ద ఇష్యూ అయ్యే ప్రమాదం ఉంటుంది.

అందుకే ఎన్టీఆర్ టీమ్ వెంటనే అలర్ట్ అయి ప్రజల్లోకి తప్పుడు సమాచారం వెళ్లకుండా సరైన సమయంలో కల్పించుకుని ఒక ప్రెస్ నోట్ ద్వారా క్లారిటీ ఇచ్చింది.

# మెగాస్టార్ మైండ్‌లో ఏముంది? ఆయన ప్లానేంటి?



మెగాస్టార్ చిరంజీవి తదుపరి చిత్రాల రిలీజ్ విషయంలో ఇంకా క్లారిటీ లేని సంగతి తెలిసిందే. ఇప్పటికే విశ్వంభర షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. కొన్ని నెలలుగా టీమ్ గ్రాఫిక్స్ పనుల్లోనే నిమగ్నమేందిజ రిలీజ్ విషయంలో రకరకాల ప్రచారం జరుగుతోంది? తప్ప ఎప్పుడు రిలీజ్ అవుతుందన్నది క్లారిటీ లేదు. దసరా పండగ నేపథ్యంలో 'విశ్వంభర' రిలీజ్ అయ్యే అవకాశాలున్నాయని బలంగా వినిపిస్తోంది. దర్శక, నిర్మాతలు కూడా అదే సరైన సమయంగా భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే చిరంజీవి 158వ సినిమా కూడా సంక్రాంతి కానుకగా రిలీజ్ చేయాలనే ప్లాన్‌లో ఉన్నారు. అదే జరిగితే? ఈ రెండు సినిమాలకు మధ్య నాలుగు నెలల గ్యాప్ ఉంటుంది. అయితే రిలీజ్ నిర్ణయాలు దర్శక, నిర్మాతల చేతుల్లోనే లేదనేది అంతే వాస్తవం. నేటి సినీ ప్రపంచంలో ఓటీటీ వేదికల ప్రభావం ఉంది. సినిమా నిర్మాణ దశ నుండే డిజిటల్ రైట్స్, థియేట్రికల్ విండోస్ గురించి ఒప్పందాలు జరుగుతున్నాయి. ఓటీటీ సంస్థలు కేటాయించే స్లాట్లు, బాక్సాఫీస్ వద్ద ఇతర భారీ చిత్రాల రాక, డిజిటల్ స్ట్రీమింగ్‌కు అనువైన గ్యాప్‌లను పరిగణనలోకి తీసుకుని మాత్రమే విడుదల తేదీలను ఖరారు చేయాల్సి ఉంటుంది. ఇక్కడ చిరంజీవి వ్యక్తిగత నిర్ణయం అత్యంత కీలకం. తన కెరీర్ గ్రాఫ్‌ను, బాక్సాఫీస్ వద్ద తన క్రేజ్‌ను బ్యాలెన్స్ చేయడంలో ఆయనకు దశాబ్దాల అనుభవం ఉంది. 'విశ్వంభర' వంటి గ్రాఫిక్స్ ప్రధాన చిత్రానికి ఎంతటి ప్రమోషన్ అవసరమో? 158వ చిత్రానికి అంతటి కమర్షియల్ హంగులు? అవసరమని అన్నయ్య భావిస్తున్నారు. వరుసగా రెండు పెద్ద సినిమాలు పండగ సీజన్లలో రావడం వల్ల కలిగే లాభనష్టాలను ఆయన క్షుణ్ణంగా విశ్లేషించుకుంటారన్నది అంతే వాస్తవం. నిర్మాతలు వాణిజ్య కోణంలో ఆలోచిస్తే.. మెగాస్టార్ కంటెంట్ .. క్వాలిటీ కోణంలో నిర్ణయాలు తీసుకుంటారు. రెండు విడుదలల మధ్య తగినంత విరామం లేకపోతే ప్రమోషన్ల భారం పెరగడమే కాకుండా ప్రేక్షకులు కూడా ఒకేసారి రెండు చిత్రాల విషయంలో అలసిపోయే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో షూటింగ్ పూర్తి చేయడంకంటే సరైన రిలీజ్ విండోను ఎంచుకోవడంపై చిరంజీవి మేనేజ్‌మెంట్ టీమ్ దృష్టి సారించే అవకాశం ఉంది. ఓటీటీ నిబంధనలకు అనుగుణంగా డేట్స్ సెట్ చేయడం అనేది అగ్నిపరీక్షగా మారే ఛాన్స్ లేకపోలేదు. గత కొన్నేళ్లుగా టాలీవుడ్‌లో రిలీజ్ క్యాలెండర్ మొత్తం మారిపోయింది. ఒకప్పుడు నిర్మాతలే నిర్ణయించే తేదీలు, ప్రస్తుతం థియేటర్ల లభ్యత, ఓటీటీ ఒప్పందాల ప్రకారం మారుతున్నాయి. సంక్రాంతి వంటి పెద్ద సీజన్‌లో 158వ చిత్రాన్ని నిలపడం ద్వారా మెగాస్టార్ తన మార్కెట్‌ను పదిలపరుచుకోవాలని చూస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ లో పోటీ కూడా తీవ్రంగా ఉంది. దీంతో ఏ స్టార్ అయినా పోటీ పడటం కంటే? ఆరోగ్య కరమైన వాతావరణంలోనే రిలీజ్ చేసుకుంటున్నారు. మరి ఈ రెండు పండగల పోటీ నడుమ మెగాస్టార్ మనసులో అసలేముంది? అన్నది తెలియాల్సి ఉంది.

# అమరావతి ఛాంపియన్ షిప్ పోటీల్లో సత్తా చాటాలి

**- 12 రకాల ఆటల పోటీలతో పాటు నగదు బహుమతులు - రాష్ట్రస్థాయిలో జిల్లా అగ్రస్థానంలో నిలపాలి - ప్రతిభ చాటి చెప్పేందుకు కూటమి ప్రభుత్వం సువర్ణ అవకాశం - యువ క్రీడాకారులకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపు**




**గజపతినగరం, (విజయనగరం), (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమరావతి ఛాంపియన్ షిప్ పోటీల్లో సత్తా చాటి చెప్పాలని యువ క్రీడాకారులకు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంత్రిగారి క్యాంప్ కార్యాలయం నందు సోమవారం క్రీడా సమరోత్సవాల కరపత్రాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 15 నుండి ఆగస్టు 26 వరకు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఈ పోటీల ప్రక్రియ ఉంటుందన్నారు.
హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ప్రత్యేక క్రీడా పోటీలను ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ పోటీలలో విజయనగరం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అమరావతి ఛాంపియన్‌షిప్ 2026 టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. క్రీడలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి పేరు ప్రఖ్యాతలు కలిగిన విజయనగరం జిల్లా ప్రతిష్ట చాటి చెప్పేందుకు క్రీడాకారులకు ఇదొక మంచి అవకాశం అని, రాష్ట్రస్థాయిలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని మంత్రి సూచించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో మొత్తం 12 రకాల క్రీడల్లో క్రీడాకారులు పాల్గొనవచ్చని, అండర్–17 మరియు అండర్–23 విభాగాలలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన బాలురు మరియు బాలికలు ఈ పోటీలలో పాల్గొనవచ్చన్నారు. ఆర్చరీ (విలువిద్య), అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖో–ఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, యోగా వంటి 12 రకాల పోటీలు ఉంటాయన్నారు. నియోజకవర్గ స్థాయిలో జులై 15 నుండి జులై 25, 2026 వరకు, జిల్లా స్థాయిలో ఆగస్టు 26 నుండి ఆగస్టు 10, 2026 వరకు, రాష్ట్ర స్థాయిలో ఆగస్టు 20 నుండి ఆగస్టు 25, 2026 వరకు ఈ పోటీలు నిర్వహించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు నియోజకవర్గ, జిల్లా స్థాయి లో ప్రతిభ చాటి చెప్పి విజయనగరం జిల్లాకు ఖ్యాతిని తీసుకు రావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటి చెప్పడం ద్వారా, వివిధ విభాగాలలో 91 లక్షల 90 వేల రూపాయలను నగదు బహుమతిని కూడా గెలుచుకునే సువర్ణ అవకాశం కూటమి ప్రభుత్వం కల్పించిందన్నారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు నమోదు కొరకు మరియు మరింత సమాచారం కోసం విజయనగరం రాజీవ్ స్టేడియంలోని డీఎస్ఏ కార్యాలయాన్ని గానీ, డి.ఎస్.ఎ. విజెడ్ ఏరెడిఫ్మెయిల్. కామ్ ఈమెయిల్ లేదా 91–8712622563 ఫోన్ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. కరపత్రాల ఆవిష్కరణలో పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు, ఏఎంసీ చైర్మన్ పీవీబీ గోపాలరాజు, బుజ్జి, బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు, రూప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్ సేవక్‌ల న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలి

**- యూనియన్ డివిజన్ కార్యదర్శి ఉపేంద్ర**

**విజయనగరం, (రాజధాని వార్తలు):** గ్రామీణ డాక్ సేవక్‌ల న్యాయమైన డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలని అఖిల భారత గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ (ఏజిడిఎస్యు) విజయనగరం డివిజన్ కార్యదర్శి టి.ఉపేంద్ర కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన డిమాండ్‌ల పరిష్కారం కోరుతూ ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సోమవారం ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా 8వ వేతన సంఘంలో గ్రామీణ డాక్ సేవక్‌లను చేర్చే విధముగా చేయడమే ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. ఈ నిరసన ర్యాలీకి డివిజన్ నుంచి పెద్ద ఎత్తున సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని ఉపేంద్ర కోరారు.



# ఎన్‌పీటీఈఎల్ డొమైన్ సర్టిఫికేషన్ సాధించిన సీతం అధ్యాపకురాలు




**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక గాజులురేగ పరిధిలో గల సీతం కళాశాల ఈసీఈ విభాగానికి చెందిన సహాయ ఆచార్యురాలు వి.ఎన్.శిరీష ప్రతిష్ఠాత్మక ఎన్‌పీటీఈఎల్, నిర్వహించిన కమ్యూనికేషన్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్ డొమైన్ సర్టిఫికేషన్‌ను విజయవంతంగా సాధించారు. ఈ సర్టిఫికేషన్ ద్వారా కమ్యూనికేషన్, సిగ్నల్ ప్రాసెసింగ్ రంగాల్లో ఆమెకు ఉన్న సాంకేతిక నైపుణ్యం మరోసారి నిరూపితమైందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఇప్పటికే ఆమె ఎన్‌పీటీఈఎల్ డిసిప్లిన్ స్టార్ గుర్తింపును రెండుసార్లు అందుకోవడం విశేషమని తెలిపింది. ఈ సందర్భంగా సీతం డైరెక్టర్ డా.మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డా.డి.వి.రామమూర్తి, ఈసీఈ విభాగాధిపతి డా.దామోదర్ నాయుడు, చీఫ్ అకాడమిక్ అడ్మినిస్ట్రేటర్ ప్రొఫెసర్ సాయిరాం పట్నాయక్ ఆమెను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి అకాడమిక్ విజయాలు సాధించి సీతంకు మరింత ప్రతిష్ఠ తీసుకు రావాలని ఆకాంక్షించారు. సీతం అధ్యాపకులు ఎన్‌పీటీఈఎల్ వంటి జాతీయ స్థాయి ఆన్‌లైన్ విద్యా వేదికల ద్వారా నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటూ, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారని యాజమాన్యం పేర్కొంది.

# పి.జి.ఆర్.ఎస్ వినతులపై శాఖాధికారులు ప్రతిరోజూ సమీక్ష నిర్వహించాలి

**- ప్రతి అర్జీదారునికి ఫోన్ చేసి నాణ్యమైన పరిష్కారం అందించాలి**
**- అగ్నిమాపక శాఖ 101 సేవలపై విస్తృత ప్రచారం చేపట్టాలి**
**- పి.జి.ఆర్.ఎస్ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఆయా శాఖలకు అందిన పి.జి.ఆర్.ఎస్ వినతుల పరిష్కార ప్రక్రియను ప్రతి శాఖాధికారి రోజువారీగా సమీక్షించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. ప్రతి వినతిదారునికి తప్పనిసరిగా ఫోన్ ద్వారా సంప్రదించి, వారి సమస్యకు నాణ్యమైన, ఖచ్చితమైన, సంతృప్తికరమైన పరిష్కారం అందించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఎండార్స్ చేసిన వినతుల్లో సానుకూలంగా పరిష్కరించినవి ఎన్ని, ప్రతికూలంగా ముగిసినవి ఎన్ని అనే అంశాలను శాఖాధికారులు నిరంతరం విశ్లేషించాలని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ వినతులను కేవలం అధికారిక విధిగా కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావించి వ్యవహరించాలని సూచించారు. ప్రజా సానుకూల అభిప్రాయంలో జిల్లా ర్యాంకు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ముందుగానే ప్రజలకు సమర్థవంతంగా వివరించి అవగాహన కల్పించాలని, సేవలు పారదర్శకంగా, నాణ్యతతో అందితే ప్రజల నుంచి సహజంగానే సానుకూల స్పందన లభిస్తుందని పేర్కొన్నారు. ఐవిఆర్ఎస్ సర్వేలో సానుకూల స్పందన తక్కువగా నమోదైన ప్రభుత్వ శాఖల పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల్లో అవగాహన పెంచుతూ సేవల నాణ్యతను మెరుగుపరచి సానుకూలతను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. అగ్నిమాపక శాఖకు సంబంధించి నెగటివ్ ఫీడ్‌బ్యాక్ అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో, అత్యవసర సేవల కోసం ఉపయోగించే 101 హెల్ప్‌లైన్ నంబర్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే 101కు సమాచారం అందించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అక్షరాంధ్ర కార్యక్రమం కింద జిల్లాలో లక్ష్యంగా నిర్దేశించిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే జిల్లా అధికారులు తమకు కేటాయించిన సచివాలయాలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. కౌశలం కార్యక్రమం ద్వారా జిల్లాకు చెందిన 139 మంది యువత టాటా మోటార్స్‌లో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొంటూ, ఈ విజయానికి కౌశలం బృందాన్ని అభినందించారు. జిల్లాలోని మరింత మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, డి.ఆర్.ఓ సత్తిబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని కలిసిన జడ్పీ డిప్యూటీ సీఈవో కే.లవరాజు

**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా నియమితులైన కే లవరాజు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం డిప్యూటీ సీఈఓ లవరాజు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని కలిసి పుష్పగుచ్చం అందజేశారు. అరకు వ్యాలీ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన లవరాజు పదోన్నతి పొంది జడ్పీ డిప్యూటీ సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కి తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షిస్తూ, ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.



# సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

**- రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఒంటేరు రవి బాబు**

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సమాచార హక్కు చట్టాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమర్థవంతంగా అమలు చేసి, దరఖాస్తుదారులకు నిర్ణీత గడువులోగా సమాచారాన్ని అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఒంటేరు రవిబాబు సూచించారు. సోమవారం నెల్లూరు పట్టణంలోని చెముడుగుంట జెడ్పీ హైస్కూల్, పంచాయతీ కార్యాలయం, విక్రమ సింహపురి యూనివర్సిటీ, విద్యుత్ భవన్, డీఈఓ కార్యాలయం, జిల్లా పరిషద్, డిపివో, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా కోర్టు, జిల్లా రిజిస్ట్రార్, డియంహెచ్ఓ, డిసిహెచ్ ఎస్, డిఎస్పీ, కలెక్టరేట్, తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) అమలుపై ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా కార్యాలయాల్లో చట్టం అమలుకు సంబంధించి అధికారులు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. సమాచార హక్కు దరఖాస్తుల నమోదు, పరిష్కారానికి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించే కీలకమైన చట్టమని పేర్కొన్నారు. చట్టం కింద అందిన దరఖాస్తులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించి, దరఖాస్తుదారులకు పూర్తి సమాచారాన్ని అందించడం ప్రతి ప్రజా సమాచార అధికారి బాధ్యత అని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి మొదటి అప్పీలేట్ అధికారి వివరాలను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా బోర్డు ప్రదర్శించాలని సూచించారు. సమాచార హక్కు చట్టానికి సంబంధించిన రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ సక్రమంగా నిర్వహించాలని, చట్టంలోని నిబంధనల మేరకు స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని కార్యాలయ నోటీస్ బోర్డులు, వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమాచార హక్కు చట్టాన్ని అధికారులు సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. తనిఖీల సందర్భంగా గుర్తించిన అంశాలపై సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేసి, లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. సమాచార హక్కు చట్టం అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కమిషనర్ రవి బాబు స్పష్టం చేశారు.



# బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణి చేసిన టిడిపి నాయకులు

**కోట, (రాజధాని వార్తలు):** కోట మండలం చంద్రశేఖర పురం వద్ద ఇటీవల జరిగిన బస్సు బైక్ యాక్సిడెంట్ బాధితులకు బైక్ లో మరణించిన ఇద్దరి వ్యక్తుల కుటుంబాలకు గాయత్రీ మెరైన్ కంపెనీ నుండి ఇద్దరికి చెరొక ఆరు లక్షలు చొప్పున పనేండు లక్షలు, ఏఎంఆర్ కంపెనీ ద్వారా చెరొక రెండు లక్షలు చొప్పున నాలుగు లక్షలు మరియు గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ సొంత నిధులు చేరొక యాభై వేలు చొప్పున లక్ష రూపాయలు అందజేశారు. మరియు డామేజ్ అయినా ఆటోకు లక్ష రూపాయలు ఎమ్మెల్యే సొంత నిధులను భాదిత కుటుంబాలకు కోట మండల నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోట మండల అధ్య క్షుడు పలగాటి భాస్కర్ రెడ్డి, షేక్ జరీల్ అహ్మద్, నెల్లూరు మోహన్ రెడ్డి, కోకొల్లు మధు యాదవ్, మద్దాలి సర్వోత్తమ రెడ్డి, రమేష్, షాంషుదిన్, సింగంశెట్టి కోటేశ్వరరావు, చల్లా సురేష్, టిడిపి మహిళ నాయకురాళ్లు పోలమ్మ, సుహాసిని, మరియు నాయకులు పాల్గొ న్నారు.



# “వైజాగ్ అంటే ఎంతో ఇష్టం కూటమి ప్రభుత్వంలో నగరం మరింత సుందరంగా మారుతోంది”: హీరో అభినవ్ సర్దార్

**- వైజాగ్‌లో 'హైదరాబాదీ చాయ్ అడ్డా' ప్రారంభం.. నగరంపై ప్రశంసలు కురిపించిన హీరో అభినవ్ సర్దార్**





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** హైదరాబాదీ చాయ్ అడ్డాను ప్రారంభించిన హీరో అభినవ్ సర్దార్..జనాలకు రుచికర మైన గరం చాయ్ తాగిపిస్తూ, యువతకు కార్పొరేట్ స్థాయిలో ఉపాధి చూపిస్తున్నారు సినీ నటుడు, వ్యాపారవేత్త, సామాజిక సేవకులు అభినవ్ సర్దార్. తెలుగు రాష్ట్రాల్లో టీ బిజినెస్‌కు పర్‌ఫెక్ట్ కార్పొరేట్ బ్రాండ్‌గా తీర్చిదిద్దిన 'హైదరాబాదీ చాయ్ అడ్డా' సంస్థను దేశవ్యాప్తంగా విస్తరించే ప్రక్రియకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో తాజాగా తన నూతన ప్రీమియం ఫ్రాంచైజీని విశాఖపట్నం అక్కయ్యపాలెంలోని ఇనార్బిట్ మాల్‌లో ప్రారంభించారు. హైదరాబాదీ చాయ్ అడ్డా సంస్థ నిర్వాహకుడు అభినవ్ సర్దార్ మాట్లాడుతూ దేశంలోని యువతకు కార్పొరేట్ స్థాయిలో ఉపాధి అందించాలనే ఉద్దేశంతో దేశంలోనే తొలిసారిగా 2016లో హైదరాబాదీ చాయ్ అడ్డాను ప్రారంభించాం. ప్రతి చాయ్ కప్పులో సంప్రదాయాన్ని, ఆధునికతను మేళవించాం. చాయ్‌ను కేవలం పానీయం కాకుండా ఒక భావోద్వేగ అనుభవంగా మార్చే లక్ష్యంతో ప్రారంభమైన హైదరాబాదీ చాయ్ అడ్డా, ఇప్పుడు ఒక సాంస్కృతిక ఉద్యమంగా మారింది. ఇప్పటికే మా ఫ్రాంచైజీలు తీసుకున్న వారు చాలా సంతోషంగా ఉన్నారు. ఈ కాన్సెప్ట్ చాలా మందికి నచ్చడంతో కొత్తగా ఫ్రాంచైజీలను తీసుకుని స్టోర్స్ ప్రారంభించేందుకు ముందుకు వస్తున్నారు. ఇందుకోసం ఫ్రాంచైజీ మోడళ్లను దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాం. వ్యాపార రంగంలో రాణించాలనే అభిరుచి కలిగిన వ్యాపారవేత్తలు ఈ చక్కని అవకాశాన్ని వినియోగించుకోవచ్చు” అని తెలిపారు.

విశాఖ నగరంపై అభినవ్ సర్దార్ మాట్లాడుతూ “నాకు విశాఖ పట్నం అంటే ఎంతో ఇష్టం. ఇక్కడి ప్రకృతి అందాలు అద్భుతంగా ఉంటాయి. ఎన్నో సినిమాల షూటింగ్స్‌కు అనువైన, సుందరమైన ప్రాంతాలు ఈ నగరంలో ఉన్నాయి. గతంలో షూటింగ్స్ కోసం నేను చాలాసార్లు విశాఖకు వచ్చాను. కూటమి ప్రభుత్వం విశాఖ పట్నాన్ని మరింత సుందర నగరంగా తీర్చిదిద్దుతోందని, భవిష్యత్తులో ఈ నగరం ఇంకెంతో అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాను” అని పేర్కొన్నారు. జనసేన నార్త్ ఇంచార్జ్ ఉష కిరణ్ మాట్లాడుతూ “ఈ తరం యువత ఉద్యోగాలు సైతం వదిలి టీ వ్యాపారంలో దూసుకుపోయేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. యువతకు కార్పొరేట్ స్థాయి వ్యాపార అవకాశం కల్పించేలా నటుడు అభినవ్ సర్దార్ 'చాయ్'కు కొత్త నిర్వచనాన్ని చెబుతూ హైదరాబాదీ చాయ్ అడ్డా సంస్థను ప్రారంభించారు. ప్రీమియం ఫ్రాంచైజీలను దేశవ్యాప్తంగా అందిస్తూ యువతకు చక్కని ఉపాధి చూపిస్తున్నారు.

జీవితంలో ఎదగాలనుకునే వారికి ఇది ఒక మంచి వ్యాపార అవకాశం” అని పేర్కొన్నారు. ఫ్రాంచైజీ నిర్వాహకులు సురేష్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఎంతో ఫేమస్ అయిన 'హైదరాబాదీ చాయ్ అడ్డా' రుచులను విశాఖ ప్రజలకు కూడా అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా ఈ ఫ్రాంచైజీని తీసుకుని ఇక్కడ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్రాంచైజీ సిబ్బంది, స్థానిక ప్రముఖులు మరియు చాయ్ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జూలై 16న సౌత్ జోన్‌లో బహిరంగ వేలం

**- జీవీఎంసీ సౌత్ జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ సౌత్ జోన్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో షాపు రూములు, మార్కెట్ లు, కళ్యాణ మండపములను లీజుకు ఇచ్చుటకు 2026 జులై 16 న ఉదయం 11.00 గంటలకు సౌత్ జోన్ సూర్యబాగ్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించబడునని జీవీఎంసీ సౌత్ జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ వేలంలో షాప్ రూములు స్ప్రింగ్ రోడ్ డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, జగదాంబ వాణిజ్య సముదాయం, పాత బస్ స్టాండ్ ఫేస్–I &II లో, పద్మనగర్, సూర్యబాగ్ వాణిజ్య సముదాయము ఫస్ట్ ఫ్లోర్‌లో, టి.ఎస్.ఆర్. వాణిజ్య సముదా యము, డైమండ్ పార్క్, ఆశీల్ మెట్ట వాణిజ్య సముదాయములలో షాపుకు, 2) మార్కెట్‌లు ఏవిఎన్ కాలేజీ దరి (రోడ్ సైడ్) ఫిష్ మార్కెట్, నెహ్రూ బజార్ మార్కెట్, శ్రీనగర్ మార్కెట్‌లకు, 3) కళ్యాణ మండపములు సైలాడ పైడితల్లి నాయుడు, శ్రీ పొట్టి శ్రీరాములు కళ్యాణమండపములకు లీజుకు ఇచ్చుటకు బహిరంగ వేలం నిర్వహించబడునన్నారు. కావున, ఆసక్తి గల వ్యక్తులు/సంస్థలు సదరు బహిరంగ వేలం నందు పాల్గొనవలసినదిగా కోరుతూ ఇతర వివరముల కొరకు సౌత్ జోన్‌లో కార్యాలయ పర్యవేక్షకులను పని వేళలలో ఉదయం 10.00 గంటల నుండి సాయింత్రం 5.00 గంటల లోపు సంప్రదించవచ్చునని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

# పేదల నివేశ స్థలాలను అమ్ముకుంటే మళ్లీ పట్టాలు ఇచ్చేది లేదు

**- ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**

**గూడూరు, (రాజధాని వార్తలు):** పేద ప్రజలకు ప్రభుత్వం కేటాయించిన నివేశ స్థలాలను విక్రయించి, అనంతరం మళ్లీ పట్టాలు కావాలని కోరితే వాటిని మంజూరు చేసే అవకాశం లేదని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ స్పష్టం చేశారు. అలాగే పేద ప్రజలను మోసపూరితంగా ప్రలోభపెట్టి వారి నివేశ స్థలాలను కొనుగోలు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఠా వర్కర్లకు ఇంటి స్థలాల పట్టాలను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పంపిణీ చేశారు. అనంతరం పలువురు పట్టణ ప్రజలు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సొంత ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం ఇంటి స్థలాల పట్టాలు అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణం చేపట్టి కుటుంబాలతో స్థిర నివాసం ఏర్పరచుకోవాలని సూచించారు. కొంతమంది లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాలను విక్రయించి, తిరిగి కొత్త పట్టాలు కోరుతూ రావడం



సరైన విధానం కాదని ఆయన అన్నారు. అటువంటి అభ్యర్థనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోదని స్పష్టం చేశారు. పేదల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మాయమాటలు చెప్పి స్థలాలను కొనుగోలు చేసే వ్యక్తులపై చట్టప రమైన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే అలాంటి లావాదేవీలను రద్దు చేసే చర్యలు కూడా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, ఏపీ లైవ్ స్టాక్ ఏజెన్సీ డైరెక్టర్ గుండాల లీలావతి, జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ రహీం, శ్రీశ్రీ ముత్యాలమ్మ చైర్మన్ దశరథ రామిరెడ్డి, మోహన్ రెడ్డి, జలీల్, శివకుమార్, హరికుమార్, భారతి తదితరులు పాల్గొన్నారు.

# వీఎస్‌యూ–బీసీ సంక్షేమ శాఖ మధ్య ఎంఓయూ

**- హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) హాస్టళ్లలో నివసిస్తున్న అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ బీసీ సంక్షేమ హాస్టల్ పథకాన్ని అమలు చేసేందుకు వీఎస్‌యూ మరియు ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా బీసీ సంక్షేమ శాఖ మధ్య సోమవారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో వీఎస్‌యూ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య కె. సునీత, జిల్లా బీసీ సంక్షేమ మరియు సాధికారత అధికారి పి.వెంకటలక్ష్మమ్మ ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా విశ్వవిద్యాలయ హాస్టళ్లలో నివసిస్తున్న ప్రభుత్వ అర్హత ప్రమాణాలు కలిగిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నారు. హాస్టల్ నిర్వహణ ఇరు సంస్థల సంయుక్త పరిపాలనా నియంత్రణలో కొనసాగుతుందని, పథకం అమలును పర్యవేక్షించేందుకు సంయుక్త పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఒప్పందంలో పేర్కొన్నారు. ఈ అవగాహన ఒప్పందం తొలుత ఒక సంవత్సరం పాటు అమల్లో ఉండగా, ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో పొడిగించే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి విశ్వవిద్యాలయం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన హాస్టల్ సౌకర్యాలు అందించడంలో ఈ ఒప్పందం కీలకంగా నిలుస్తుందని రిజిస్ట్రార్ ఆచార్య కె. సునీత పేర్కొన్నారు. సదరు హాస్టల్ సౌకర్యాన్ని కల్పించినందుకు ఉపకులపతి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లని కలెక్టరేట్‌లో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. విశ్వావిద్యాలయ విద్యార్థులకు అందించినందుకుగాను ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ ఆచార్య పి.వీరారెడ్డి, విశ్వవిద్యాలయ హాస్టల్ వార్డెన్లు డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, డాక్టర్ కోట నీల మణికంఠ, ఆచార్య పి. త్రివేణి, డాక్టర్ కె.వి.ఎల్. శ్రీకన్యారావు, జిల్లా బీసీ సంక్షేమ శాఖకు చెందిన ఎం. శ్రీదేవి (ఏబీసీడబ్ల్యూఓ), కె.మమత (హెచ్‌డబ్ల్యూఓ), సీహెచ్. సుమలత (హెచ్‌డబ్ల్యూఓ), హాస్టల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అమరుడు గంట పాపారావు ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

**- సీనియర్ న్యాయవాది గంట మోహన్ రావు**






**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నంలో అమరుడు గంట పాపారావు సంస్మరణ సభ నిర్వహిం చారు. సమావేశాన్ని వాడమొదలు జగ్గయ్య అమరుడు గంట పాపారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటిస్తూ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, బహుజనులు రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో గంట పాపారావు జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. గంగవరం పోర్టు నిర్వాసితుల హక్కుల పరిరక్షణ కోసం జరిగిన ఉద్యమంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారని, జెట్టి నిర్మాణం, జీవన భృతి, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం నిరం తరం ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రజల హక్కుల కోసం పోరాడే క్రమంలో ఎన్నో ఒత్తిళ్లు, ఇబ్బం దులు, ఆటంకాలను ఎదుర్కొన్నప్పటికీ గంట పాపారావు ఎప్పుడూ వెనుకడుగు వేయలేదని వక్తలు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే తన ధ్యేయంగా భావించి చివరి శ్వాస వరకు ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ధైర్యవంతుడైన నాయకుడిగా ఆయనను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ గంగవరం పోర్టు నిర్వాసితుల జెట్టి నిర్మాణం, జీవన భృతి, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాడమొదలు జగ్గయ్య, చింతాడ సూర్యం, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోను కృష్ణ, రమణ, కన్నయ్య, తాతారావు సీనియర్ న్యాయవాది గంట మోహన్ రావు, పోలరాజు, రాజేశ్వరి, పలువురు సామాజికవేత్తలు, బహుజన ఉద్యమ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అమరుడు గంట పాపారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయనతో తమకున్న అనుబంధాలను, ప్రజా ఉద్యమాల్లో ఆయన చేసిన సేవలను, మధుర జ్ఞాపకాలను స్మరించుకున్నారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

**- ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి సందర్భంగా కరప మండల శివాలయాల్లో ప్రార్థనలు**





**కరప, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కాకినాడ రూరల్ నియోజకవ ర్గంలోని కరప మండల శివాలయాల్లో సోమవారం ఆరుద్ర నక్ష త్రం, మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలోని జనసేన నాయకులు, జనసైనికులు, పార్టీ కార్యకర్తలు తమ తమ గ్రామాల శివాలయాలకు చేరుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించి పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం భగవంతుని ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని, ఆయనకు దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు. కరప మండలంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్, దేవిశెట్టి శేఖర్, గుణ్ణం ఉదయ శంకర్, బత్తుల సతీష్ ధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక పూజల్లో శివలింగానికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అర్చనలు, హారతులు సమర్పించి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని మరింత ఉత్సాహంతో ప్రజాసేవను కొనసాగించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి తన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ప్రతి జనసైనికుడి ఆకాంక్ష అని తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆశీస్సులు, భగవంతుని అనుగ్రహంతో ఆయన త్వరలోనే పూర్తిగా కోలుకుని ప్రజాసేవలో మరింత చురుకుగా పాల్గొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గొడ్డటి పాలెం జనసేన గ్రామ అధ్యక్షులు వీరం రెడ్డి ముత్యాలరావు, బోనస్ పుల్లయ్య ప్రసాద్, టేకు విష్ణు నాయుడు, పబినీడి శ్రీరామ్ మూర్తి, రెడ్డి లోవరాజు, తోట కృష్ణ, జనసేన నాయకులు, కార్య కర్తలు, అభిమానులు, వీర మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**RAJADHANI CLASSIFIEDS Ad. Call**
**9440662699, rajadhanivartalu.com**

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎవ్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# భారత్ - యూకే వాణిజ్య ఒప్పందం : ప్రతి భారతీయుడికీ అపార అవకాశాలు

నేటి నుండి, సమగ్ర ఆర్థిక మరియు వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) అమలులోకి రావడంతో, యూకేకు జరిగే భారతీయ ఎగుమతుల్లో దాదాపు అన్నీ సుంక రహిత ప్రవేశాన్ని పొందుతాయి; ఇది మన చిన్న తరహా వ్యాపారాలు, రైతులు, మత్స్యకారులు, ఆవిష్కర్తలు, మహిళలు మరియు శ్రమశక్తి ఆధారిత కలిగిన పరిశ్రమలకు భారీ అవకాశాలను కల్పిస్తుంది. ఇది భారతదేశపు అత్యంత సమగ్రమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ), ఇది అనేక ఉద్యోగాలు, వాణిజ్య అవకాశాలను సృష్టించడం ద్వారా దేశ ఆర్థిక రంగాన్ని ఎంతగానో బలోపేతం చేస్తోంది. అంతే కాదు.. అంతర్జాతీయ మార్కెట్ పోటీని తట్టుకునేలా మన దేశీయ తయారీదారులను క్రమంగా సన్నద్ధం చేస్తుంది. దీంతో.. ప్రతి పౌరుడికి తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులు అందుబాటులోకి వస్తాయి. ఈ పరిణామాలు ప్రధాని మోదీ సంకల్పించిన 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని చేరుకోవడంలో మరింత వేగవంతం చేస్తాయి. ఈ ఒప్పందంతో వ్యాపార వర్గాలు సరికొత్త ఉత్సాహం కనిపిస్తోంది. బ్రిటన్ కు సరుకులను ఎగుమతి చేసే సంస్థలు విస్తృతమైన ప్రణాళికలతో సిద్ధమయ్యాయి. రత్నాలు, ఆభరణాల ఎగుమతిదారులు మూడేళ్లలోపే 230 శాతం ఎగుమతులు పెరిగి ￡2.5 బిలియన్లకు చేరుకుంటాయని భావిస్తుండగా, ఇంజనీరింగ్ వస్తువుల ఎగుమతులు రాబోయే 4-5 ఏళ్లల్లో దాదాపు రెట్టింపై ￡7.5 బిలియన్లకు చేరుకుంటాయని ఆశిస్తున్నారు. గతేడాది ప్రధాని మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమక్షంలో కుదిరిన ఈ పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందం, దాదాపు 99శాతం టారిఫ్ లైన్లపై సుంకాలను తక్షణమే రద్దు చేస్తోంది. ఇది దాదాపు 100 శాతం వాణిజ్య విలువలుకు వర్తిస్తుంది, ప్రపంచ అస్థిరతల మధ్య కూడా ఇప్పటికే అద్భుతంగా వృద్ధి చెందుతున్న భారతీయ ఎగుమతులకు అపారమైన అవకాశాలను సృష్టిస్తుంది.

**యువ మనస్సులు, ప్రపంచ ఆవిష్కరణలు**

ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా రూపుదిద్దుకున్న ఈ ఎఫ్టీఏ జూలై 15న అమలులోకి వస్తుంది, విశేషమేమిటంటే.. ఈ రోజు "ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం" కూడా. 2015లో సరిగ్గా ఇదే రోజున, ప్రధాని మోదీ 'స్కిల్ ఇండియా మిషన్'ను ప్రారంభించారు. ఆ నైపుణ్య శిక్షణే నేడు మన యువతను కేవలం భారత్ లోనే కాక, ప్రపంచవ్యాప్తంగా పోటీ పడేందుకు, రాణించేందుకు, నాయకత్వం వహించేందుకు సన్నద్ధం చేస్తోంది. భారతీయ యువత ప్రయోజనం కోసం, బ్రిటన్ తన సేవా రంగంలో అత్యంత సమగ్రమైన భాగస్వామ్యానికి అంగీకరించింది.



భారతదేశానికి ఎగుమతి అవకాశాలున్న అన్ని ప్రధాన రంగాలు సహా మొత్తం 137 ఉప రంగాలను ఇందులో చేర్చారు. మెరుగైన మార్కెట్ ప్రవేశం, స్పష్టమైన నియంత్రణల వల్ల ఐటీ, ఐటీ-ఆధారిత సేవలు, ఆర్థిక సేవలు, వృత్తిపరమైన సేవలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, ఇంజనీరింగ్, టెలికాం, కన్సల్టెన్సీ సేవలలో భారతీయ నిపుణులకు ఎంతో మద్దతు ఇస్తుంది.

**ఉద్యోగాల సృష్టి**

మార్కెట్ పరిధి విస్తరించడం వల్ల రత్నాలు-ఆభరణాలు, వస్త్రాలు, తోలు-పాదరక్షలు, సేంద్రీయ రసాయనాలు, ప్లాస్టిక్స్, ఆటో విడిభాగాలు, హస్తకళల ఉత్పత్తులు, ఆహార శుద్ధి వంటి శ్రమశక్తి ఆధారిత పరిశ్రమలు తమ కార్యకలాపాలను విస్తృతం చేస్తాయి. దీనివల్ల యువతకు మరింతగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. మొత్తంగా, ప్రపంచ విలువ గొలుసులతో అనుసంధానం కావడం, దేశీయ పరిశ్రమల పోటీతత్వాన్ని పెంచడం ద్వారా, అంతర్జాతీయ మార్కెట్లలో రాణించడానికి, దేశాభివృద్ధిని నడపడానికి అవసరమైన నైపుణ్యాలు, అవకాశాలను భారతీయ యువతను సీఈటీఏ అందిస్తుంది. ఈ ఒప్పందంలోని ముఖ్యమైన అంశం 'డబుల్ కాంట్రిబ్యూషన్ కన్వెన్షన్'. సీఈటీఏతో పాటు అమలులోకి వచ్చే ఈ మైలురాయిలాంటి ఏర్పాటు ద్వారా, తాత్కాలిక విధుల్లో భాగంగా యూకే వెళ్లే భారతీయ ఉద్యోగులు, వారి యజమానులు అక్కడ రెండుసార్లు సామాజిక భద్రతా సహకారాన్ని చెల్లించాల్సిన అవసరం ఉండదు. తాత్కాలిక విదేశీ ప్రాజెక్టులపై వెళ్లే ఉద్యోగుల నిరంతర సామాజిక భద్రతా కవరేజీ ద్వారా 75,000 కంటే ఎక్కువ మంది భారతీయ నిపుణులు, 900 కంటే ఎక్కువ సంస్థలు ప్రయోజనం పొందుతాయని భావిస్తున్నారు.

**స్థానికంగా ఎదగండి, ప్రపంచ వ్యాప్తంగా విక్రయించండి**

బ్రిటన్‌కి చెందిన ￡37.5 బిలియన్ల మార్కెట్ అందుబాటులోకి రావడంతో భారతీయ రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఇది భారతీయ పాల ఉత్పత్తులు, టీ, కాఫీ, మసాలా దినుసులు, పండ్లు, కూరగాయలు, పండ్ల రసాలు, మాంసాలు, శుద్ధి చేసిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను పెంచుతుంది. బ్రిటన్ దిగుమతి చేసుకునే వ్యవసాయ ఉత్పత్తులలో దాదాపు 95 శాతం రకాలకు భారతదేశం నుంచి ఎలాంటి సుంకాలు లేని ప్రవేశాన్ని కల్పించారు. దీంతో బ్రిటన్‌లోని భారీ మార్కెట్‌కు మన దేశం నుంచి జరిగే వ్యవసాయ ఎగుమతులు రాబోయే మూడేళ్లలో 50 శాతం వరకు పెరిగే అవకాశముంది. ఇది వ్యవసాయ ఆదాయాలను పెంచడమే కాక, వ్యవసాయ ఆధారిత అనుబంధ రంగాలలో సరికొత్త ఉద్యోగాలను సృష్టిస్తుంది. ముఖ్యంగా, డెయిరీ, కూరగాయలు, ఆపిల్స్, వంట నూనెలు, ఓట్స్, చిరుధాన్యాలు, ఇతర సున్నిత వ్యవసాయ ఉత్పత్తులను సున్నితమైన జాబితా (సెన్సిటివ్ లిస్ట్)లో ఉంచడంతో ఈ ఒప్పందం వాటికి పూర్తి రక్షణ కల్పిస్తుంది. ఈ వస్తువులపై యూకేకు ఎటువంటి సుంకం మినహాయింపులు ఇవ్వలేదు. ఈ మినహాయింపులు ఆహార భద్రత, దేశీయ ధరల స్థిరత్వం, బలహీనమైన వ్యవసాయ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే మోదీ ప్రభుత్వ వ్యూహాన్ని ప్రతిబింబిస్తాయి.

**ఎస్ఎంఈలు - స్థానిక కృషి, ప్రపంచ స్థాయి బలం**

ప్రధాని మోదీ ఎల్లప్పుడూ భారతదేశ చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. 2024-25లో భారతదేశ మొత్తం ఎగుమతుల్లో 45.8శాతం వాటాను కలిగిన కీలకమైన ఎస్ఎమ్ఈ రంగానికి సహాయం చేయడానికి సీఈటీఏలో ప్రత్యేక అధ్యాయాన్ని చేర్చారు. వేగవంతమైన కస్టమ్స్ ప్రాసెసింగ్, డిజిటల్ ట్రేడింగ్ వ్యవస్థల గుర్తింపు, సులభతరం చేసే ఒప్పందాలు, కాగితరహిత వాణిజ్యంతో సహా కీలకమైన నిబంధనలతో సీఈటీఏ చిన్న పరిశ్రమలకు ఎంతో తోడ్పడుతుంది. ప్రాధాన్యత కలిగిన మార్కెట్ అవకాశాలతో పాటు, వాణిజ్యం, విద్య, ఆర్థికం, డిజిటల్ నైపుణ్యాలు, వ్యాపార మౌలిక సదుపాయాలు, ఇతర ముఖ్యమైన రంగాలకు సంబంధించిన ఉత్తమ పద్ధతులపై మెరుగైన సహకారం ద్వారా ఎస్ఎంఈలు ప్రయోజనం పొందుతాయి.

**మత్స్యకారులకు పెద్ద లబ్ధి**

దాదాపు 2.8 కోట్ల మంది జీవనోపాధికి మద్దతుగా నిలిచే భారతదేశ మత్స్య, ఆక్వా రంగానికి ఈ ఒప్పంద గణనీయమైన ప్రయోజనం చేకూర్చనుంది. మెరుగైన మార్కెట్ ప్రవేశం, అధిక ఎగుమతుల వల్ల ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర తీరప్రాంత మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుతుంది. ఇది భారత మత్స్య ఎగుమతులను బలోపేతం చేయడమే కాక, మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధికి దోహదం చేస్తుంది, తీరప్రాంత ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

**మహిళలకు విజయం**

సంప్రదాయ ఎఫ్టీఏల కంటే ఎంతో విస్తృతమైన ఈ చారిత్రక ఒప్పందం, నిరంతర, సమగ్ర ఆర్థిక వృద్ధిని సాధించడంలో మహిళల సహకారాన్ని గుర్తిస్తుంది. ఇది మహిళలకు సమాన అవకాశాలు, ఆర్థిక లబ్ధి చేకూర్చడమే దీని ముఖ్య ఉద్దేశం. మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న రంగాలలో మహిళల పాత్రను పెంచడానికి, వారి ఆర్థిక సాధికారత, అక్షరాస్యతను ప్రోత్సహించడానికి, పని ప్రదేశాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం, వారి సామర్థ్యాన్ని, నైపుణ్యాలను పెంపొందించడం వంటి వివిధ అంశాలపై ఇరు దేశాలు సంయుక్తంగా పని చేసేందుకు అంగీకరించాయి. సీఈటీఏ అనేది కేవలం ఒక వాణిజ్య ఒప్పందం మాత్రమే కాదు. ఇది భారతదేశ సామర్థ్యాలు, ఆకాంక్షలపై ప్రపంచ దేశాలకున్న నమ్మకానికి నిదర్శనం. ఇది ప్రపంచ వాణిజ్యంలో కేవలం ఒక భాగస్వామిగానే కాకుండా, దాన్ని శాసించే స్థాయికి ఎదిగిన నూతన భారతదేశాన్ని ప్రతిబింబిస్తుంది. మన రైతులు, మత్స్యకారులు, కార్మికులు, మహిళా పారిశ్రామికవేత్తలు, చిన్న పరిశ్రమలు, నిపుణులు, యువతకు సాధికారత కల్పించడం ద్వారా, ఈ ఒప్పందం దేశంలోని ప్రతి మూలలోని భారతీయుడి జీవితంలో సానుకూల మార్పును తీసుకు వస్తుంది.

**శ్రీ పీయూష్ గోయల్**
(రచయిత: కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ మంత్రి)

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan